



TE TL/26/A2635

వాస్తవాలు పలుకు DD9

# వార్త

తెలుగు దినపత్రిక






హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:87 | 09-08-2026 ఆదివారం | పేజీలు: 08 | వెల 3/-




## పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

- రూ.2.25 కోట్లు అందించాలని కేసీఆర్ నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 8 :** అనారోగ్యంతో ఇటీవల మరణించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలనుంది. ఆయన కుటుంబానికి పార్టీ తరపున రూ.2.25 కోట్ల సాయం అందజేయాలని పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య

మిగతా 2వ పేజీలో..

## అడవి బిడ్డల అరణ్యరోదన..




3

- అస్తిత్వం కోసం ఆదివాసుల పోరుబాట
- అరకొర నిధులతో నెట్టుకొస్తున్న భద్రాచలం ఐటీడీఏ
- పోలవరం ముంపుతో ఆగమాగమైన బతుకులు
- నేడు భద్రాచలంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు



# పోలవరం–బనకచర్లకు పొలిటికల్ బ్రేక్?

## చంద్రబాబు వైఫల్యమా... రేవంత్ విజయమా!

- సాంకేతిక, చట్టపరమైన లోపాల సవరణకే కేంద్ర అప్రైజల్ కమిటీ ప్రతిపాదనలు వెనక్కి
- పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే ముందడుగు
- కేంద్రం తిరస్కరణపై కాంగ్రెస్ సంబురాలు

**హైదరాబాద్, ఆగస్టు 8:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని భావిస్తున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల అప్రైజల్ కమిటీ ప్రతిపాదనలు వెనక్కి పంపడం రాజకీయ దుమారం రేపింది. ఈ పరిణామాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన విజయంగా ప్రచారం చేస్తుండగా.. ఏపీలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యంగా విమర్శిస్తోంది. అయితే కేంద్ర కమిటీ నిర్ణయాన్ని నిశితంగా పరిశీలిస్తే.. ఇది ప్రాజెక్టును పూర్తిగా తిరస్కరించడం కాకుండా సాంకేతిక, చట్టపరమైన అంశాలను సరిదిద్ది తిరిగి రావాలన్న సూచనగా కనిపిస్తోంది.

**కేంద్రం నిర్ణయంతో కొత్త చర్చ**

పోలవరం-బనకచర్ల అనుసంధానానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనల్లో నీటి లభ్యత, అంతర్రాష్ట్ర ప్రయోజనాలు, పర్యావరణ ప్రభావం వంటి అంశాలపై మరింత స్పష్టత

మిగతా 2వ పేజీలో..

## క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

- తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు
- నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది
- నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సీఎం రేవంత్ రెడ్డి
- మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



## యూఏఈ బతుకమ్మ సంబరాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

2



2

## ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు భారీ స్పందన

- 7,340 ఇండ్లకు 35,125 దరఖాస్తులు
- 20 తర్వాత లాటరీ
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం
- 7,340 ఇండ్లకు 35,125 దరఖాస్తులు
- మరో రెండు రోజులు మాత్రమే గడువు



## రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలు

- రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- వేమా డ్రైవర్లెస్ కారులో ప్రయాణం

2

## దేశంలో కాంగ్రెస్ ఆదరణ పెరుగుతోంది..



6

దేశంలో కాంగ్రెస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ భూస్థాపితం కావడం ఖాయమని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం తథ్యమని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- రానున్న రోజుల్లో బీజేపీ భూస్థాపితం కావడం ఖాయం
- పార్లమెంట్ లో మ్యాగీ నూడిల్స్‌లా రెండు మూడు నిమిషాల్లో బిల్లులు పాస్ చేస్తున్నారు.. ఎంపీల అభిప్రాయాలకు విలువలేదు
- డీలిమిటేషన్ పేరుతో బీజేపీ ముందస్తు రాజకీయ లబ్ధికి యత్నిస్తుంది. ప్రజల చేతిలో ఆ పార్టీ కూలడం ఖాయం
- బీజేపీ, బీఆర్ఎస్ దొంగదెబ్బలపై అప్రమత్తంగా ఉండాలి.. కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలి
- గ్రూపు రాజకీయాలకు తావులేకుండా కాంగ్రెస్ జెండా ఎగరేయడమే ఏకైక



## మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

- మహిళా సాధికారతకు అండగా కాంగ్రెస్
- యూత్ కాంగ్రెస్ నారీ శక్తి అభియాన్ శిక్షణలో మంత్రి సీతక్క

**ఢిల్లీ, ఆగస్టు 8 :** మహిళల రాజకీయ భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మహిళలు కేవలం ఓటర్లుగా కాక దేశ భవిష్యత్తుకు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలిచిందన్నారు. ఢిల్లీలోని యూత్ కాంగ్రెస్ నారీ శక్తి అభియాన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

మిగతా 2వ పేజీలో..

# రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలు

**శాన్ ఫ్రాన్సిస్కో, ఆగస్టు 8:**




తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాలని పేర్కొన్నారు. అమెరికాలోని శాన్ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ (సీజీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. పారిశ్రామిక కారిడార్లు, పార్కుల్లో తయారీ, ఐటీ, జీవశాస్త్రం, స్వచ్ఛ ఇంధనం తదితర రంగాల్లో పెట్టుబడులకు అనువైన భూమి అందుబాటులో ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర విద్యా. సాంకేతిక సంస్థలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించే సామర్థ్యం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంప్రదాయ విద్యుత్ పాటు పునరుత్పాదక ఇంధన వనరు రంగంలోనూ రాష్ట్రం గరిష్ట ప్రగతిని సాధిస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అనుమతులకు ఎక్కడా అలస్యం జరక్కుండా పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, సుస్థిర పట్టణ ప్రణాళికను సమన్వయం చేస్తూ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని చెప్పారు. ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ ప్రవాసులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలో భాగస్వాములు కావాలని కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాన్ఫ్రాన్సిస్కోలో వేమో స్వయంచాలక (డ్రైవర్స్) వాహనంలో ప్రయాణించారు. అనంతరం వేమో ప్రతినిధులతో సమావేశమై స్వయంచాలక వాహన సాంకేతికత, దాని నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నియంత్రణ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్ తో పాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో స్వయంచాలక మొబిలిటీ పరిష్కారాలను ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలపై ఆయన ఆరా తీశారు. ఇందుకు అవసరమైన అధిక రిజల్యూషన్ మ్యాపింగ్, సెన్సార్ అనుకూల రోడ్డు డిజైన్, ప్రత్యేక టెస్టింగ్ కారిడార్లు, డేటా కనెక్టివిటీ, ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల గురించి వేమో ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయంచాలక వాహనాల ట్రయల్స్, భవిష్యత్ విస్తరణకు అవసరమైన నియంత్రణ, విధానపరమైన చట్రాలపైనా చర్చించారు. నూతన తరం మొబిలిటీ సాంకేతికతను హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆసక్తి వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు భారీ స్పందన

- **7,340 ఇండ్లకు 35,125 దరఖాస్తులు**
- **మరో రెండు రోజులు మాత్రమే గడువు**
- **20 తర్వాత లాటరీ**
- **హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం**

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పేదలకు అల్పాదాయ వర్గాలకు సొంతి ఇల్లు కల్పించాలన్న లక్ష్యంతో హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో నిర్మించనున్న ఫ్లాట్లకు భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గంలో 500 ఇండ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న 7,340 ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తుండగా శనివారంనాటికి 35,125 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 10వరకు దరఖాస్తు చేసుకోవచ్చని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంతో విలువైన భూముల్లో నిర్మిస్తున్న ఈ ఇండ్లను కేవలం నామమాత్రపు ధరకే అందిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.58 లక్షల వరకు ధర పలికే ఈ ఫ్లాట్లను ప్రజల సంక్షేమం కోసం వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న ఉద్దేశంతో కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం కేటాయిస్తున్నదని తెలిపారు. ఇండ్లు పొందిన వారికి రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. ప్రజలు సొంత ఇంటి కోసం తాము నివసిస్తున్న ప్రాంతాల నుంచి వలస/తరలివెళ్లకుండా ప్రస్తుతం వారు ఉంటున్న నియోజకవర్గంలోనే సొంత ఇంటిని పొందే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఇలాంటి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. దరఖాస్తు సమయంలో ఎలాంటి కుల, ఆదాయ సర్టిఫికెట్లు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. ఇండ్లు రాని పక్షంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు ఫీజు రూ.10వేలు తిరిగి చెల్లిస్తామని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తులను సమర్పించడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**20 తరువాత లాటరీ..**

**ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి**

ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తూనే మరోవైపు ఇండ్ల కేటాయింపు, నిర్మాణాలకు సంబంధించిన కార్యాచరణపై కూడా హౌసింగ్ బోర్డు చర్యలు తీసుకుంటున్నది. ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియను ఈ నెల 20 నుంచి చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అంతేకాక ఆయా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులను చేపట్టడానికి టెండర్ ప్రక్రియను కూడా చేపట్టింది. ఈ ఇండ్లన్నింటినీ ఒక ఏడాదిలోపే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా పకడ్బందీ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు గౌతం వెల్లడించారు.

**నియోజకవర్గాలవారీగా దరఖాస్తులు**

ఖైరతాబాద్ 4,394, అంబర్‌పేట 2,357, బహదూర్‌పుర1,135, ఇబ్రహీంపట్నం749, కూకట్‌పల్లి5,233, కార్వాన్1,574 మహేశ్వరం471, మలక్‌పేట2,846, మల్కాజిగిరి1,033, మేడ్చల్1,153, నాంపల్లి3,613, సనత్‌నగర్1,046, కుత్బుల్లాపూర్4,121, రాజేంద్రనగర్1,496, సికింద్రాబాద్ కంటోన్మెంట్1,374, శేరిలింగంపల్లి2,530మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ టవర్స్‌కు సంబంధించి సందేహాల నివృత్తికి కాల్ సెంటర్ ఫోన్ 04024603572ను సంప్రదించవచ్చని గౌతం సూచించారు.



# పోలవరం–బనకచర్లకు పొలిటికల్ బ్రేక్?

**మొదటిపేజీ తరువాయి**

అవసరమని కేంద్ర నిపుణుల కమిటీ భావించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రతిపాదనలను వెనక్కి పంపింది. దీంతో ప్రాజెక్టుకు రాజకీయంగా బ్రేక్ పడిందా? లేక అనుమతుల ప్రక్రియలో ఇది సాధారణ దశేనా? అన్న చర్చ మొదలైంది.

**చంద్రబాబు వైఫల్యమా?**

ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించి ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నించిన చంద్రబాబు ప్రభుత్వానికి కేంద్ర కమిటీ నిర్ణయం ఎదురుదెబ్బేనని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. ప్రాథమిక అనుమతులు, సాంకేతిక నివేదికలు, అంతర్రాష్ట్ర అంశాలపై పూర్తి స్థాయి కసరత్తు చేయకుండానే ప్రతిపాదనలు పంపడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శిస్తోంది. భారీ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని చట్టబద్ధ ప్రక్రియలను పూర్తి చేసి ఉండాల్సిందని పేర్కొంటోంది.

**రేవంత్ విజయమా?**

మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ శిబిరం మాత్రం కేంద్ర నిర్ణయాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వ దౌత్యపరమైన విజయంగా అభివర్ణిస్తోంది. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన అభ్యంతరాల ఫలితంగానే ప్రాజెక్టు ప్రతిపాదనలు



వెనక్కి వెళ్లాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్రం నిర్ణయంపై తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకోవడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

**పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలే కీలకం**

ఈ ప్రాజెక్టు అమలులో తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలు కూడా ముడిపడి ఉన్నాయి. గోదావరి జలాల వినియోగం, ముంపు ప్రభావం, నీటి కేటాయింపులు వంటి అంశాలపై ఆయా రాష్ట్రాల అభ్యంతరాలను పరిష్కరించాల్సి ఉంటుంది. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన చట్టాలు, ఒప్పందాల ప్రకారం ప్రభావిత రాష్ట్రాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియ ముందుకు సాగాల్సి ఉంటుంది.

**200 టీఎంసీల తరలింపే లక్ష్యం**

గోదావరి నుంచి సుమారు 200 టీఎంసీల వరద నీటిని రాయలసీమకు తరలించడం పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. దీని ద్వారా దాదాపు 80 లక్షల మందికి తాగునీరు, సుమారు 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇంత భారీ ప్రాజెక్టుకు నీటి లభ్యతపై శాస్త్రీయ ధ్రువీకరణతో పాటు పర్యావరణ, అంతర్రాష్ట్ర అనుమతులు తప్పనిసరి.

**తిరస్కరణ కాదు.. సవరణకు అవకాశం**

కేంద్ర అప్రైజల్ కమిటీ ప్రతిపాదనలు వెనక్కి పంపినంత మాత్రాన ప్రాజెక్టు శాశ్వతంగా నిలిచిపోయినట్లు కాదని నిపుణుల అభిప్రాయం. సీడబ్ల్యూసీ నుంచి నీటి లభ్యతపై స్పష్టత, ముంపు ప్రభావంపై సమగ్ర అధ్యయనం, పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులు, అవసరమైన చట్టబద్ధ అనుమతులు పూర్తి చేసి సవరించిన ప్రతిపాదనను మళ్లీ సమర్పించే అవకాశం ఉంటుంది.

**రాజకీయ క్రెడిట్ వార్..**

**ప్రాజెక్టు భవిష్యత్తు ఏంటి?**

ప్రస్తుతం చంద్రబాబు వైఫల్యమా.. రేవంత్ విజయమా అన్న రాజకీయ చర్చ వేడెక్కినా, అసలు ప్రశ్న మాత్రం పోలవరం-బనకచర్ల అనుసంధానం చట్టబద్ధంగా ఎప్పుడు ముందుకు సాగుతుందన్నదే. సాంకేతిక లోపాలను సరిదిద్ది, అంతర్రాష్ట్ర అభ్యంతరాలను పరిష్కరించి, అన్ని అనుమతులు సాధిస్తేనే ఈ ప్రాజెక్టుకు శాశ్వత భవిష్యత్తు ఉంటుంది. రాజకీయంగా ఎవరు క్రెడిట్ తీసుకున్నా.. తుది నిర్ణయం మాత్రం చట్టబద్ధమైన అనుమతులపైనే ఆధారపడి ఉంటుంది.

# మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

**ఢిల్లీ, ఆగస్టు 8 :**

మహిళల రాజకీయ భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మహిళలు కేవలం ఓటర్లుగా కాక దేశ భవిష్యత్తుకు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలిచిందన్నారు. ఢిల్లీలోని యూత్ కాంగ్రెస్ నారీ శక్తి అభియాన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాజకీయాల్లో మహిళల పాత్ర, మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి, నిర్ణయాత్మక శక్తిగా మహిళలు ఎదగడంలో కాంగ్రెస్ పాత్ర, ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు వంటి అంశాలపై కీలక ఉపన్యాసం చేశారు. మహిళల అభివృద్ధి లేకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదని సీతక్క అన్నారు. మహిళల హక్కులు, సమాన అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని తెలిపారు. మహిళలకు సమానావకాశాలు కల్పించడం కేవలం సంక్షేమ కార్యక్రమం కాదని, అది సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. దేశంలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఓటు హక్కు రావడంతోనే సమానత్వం పూర్తికాదని, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం, ప్రభుత్వాలను నడిపించే అవకాశం కూడా సమానంగా ఉండాలని అన్నారు. మహిళలు రాజకీయాల్లోకి వస్తే వారి దృష్టి రోడ్లు, భవనాలపై ఉండదని, పిల్లల విద్య, తల్లుల ఆరోగ్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోషకాహారం, గ్రామీణ జీవనోపాధులు, మహిళల ఆర్థిక స్వావలంబన వంటి అంశాలకు మహిళా నాయకత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ మారుమూల అడవుల్లో, గిరిజన ప్రాంతాల్లో ప్రజలతో కలిసి పని చేసిన అనుభవం మహిళల రాజకీయ భాగస్వామ్యం ఎంత అవసరమో తనకు నేర్పిందన్నారు. అవకాశాలు కల్పిస్తే మహిళలు నాయకత్వంలో అద్భుతంగా రాణించగలరని చెప్పారు. ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మంత్రి సీతక్క తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు ప్రజా సమస్యలను లేవనెత్తినప్పుడు వారి వాదనలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారం, మార్ఫింగ్, బెదిరింపులకు పాల్పడటం ఆందోళనకరమని అన్నారు. మహిళల గొంతును అణచివేసే డిజిటల్ వేధింపులు కేవలం ఒక మహిళకు ఎదురవుతున్న సమస్య కాదని, అది ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాలని సీతక్క అన్నారు. ఇలాంటి దాడులు రాజకీయాల్లోకి రావాలనుకునే యువతులను కూడా వెనక్కి లాగే ప్రమాదం ఉందని తెలిపారు. రాజకీయ విభేదాలు విధానాలపై ఉండాలి కానీ వ్యక్తులపై కాదని స్పష్టం చేశారు. మహిళలపై ఆన్‌లైన్ వేధింపులకు పాల్పడే సంస్కృతిని అడ్డుకోవాల్సిన బాధ్యత పార్టీలు, మీడియా, డిజిటల్ వేదికలు, పౌర సమాజంపై ఉందన్నారు. తెలంగాణలో మహిళా స్వయం సహాయక సంఘాల విజయాలను ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రస్తావించారు. చిన్న పొదుపులతో ప్రారంభించిన మహిళలు నేడు వ్యాపారవేత్తలుగా ఎదిగి ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగస్వాములుగా మారారని చెప్పారు. పాఠశాల యూనిఫామ్‌ల తయారీ నుంచి గ్రామీణ జీవనోపాధుల బలోపేతం వరకు మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని తెలిపారు.

# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

**మొదటిపేజీ తరువాయి**

నేతలతో కేసీఆర్ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం రూ.25 లక్షలను ఆమె పేర బ్యాంకులో జమ చేయాలని కూడా కేసీఆర్ నిర్ణయించారు. అంతేగాక పిల్లల భవిష్యత్తు, వారి చదువు, కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని అధినేత తెలిపారు. కాగా, సుదర్శన్ రెడ్డి దశదిన కర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత పార్టీ జిల్లా ముఖ్యులు సమావేశమై వారి కుటుంబ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారని, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

**రేపు పెద్ది కుటుంబ సభ్యులకు కేసీఆర్ పరామర్శ**

నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లబెల్లికి కేసీఆర్ ఆదివారం వెళ్లి పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న అధినేత కేసీఆర్ తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఈ సందర్భంగా ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులైవున్న పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్టకాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో పార్టీ నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసీఆర్ గుండె ధైర్యం నింపనున్నారు.

# యూఏఈ బతుకమ్మ సంబరాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

- **అక్టోబర్ 11న దుబాయ్ అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో వేడుకలు**
- **కార్మికుల సమస్యలపై ఈటీసీఏ ప్రతినిధులతో కేటీఆర్ చర్చ**

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏయూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈమేరకు కేటీఆర్ నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో పదహారేళ్లుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, తెలంగాణ సంస్కృతీసాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

**గల్ఫ్ కార్మికుల పరిస్థితులపై ఆరా**

ఈ సందర్భంగా గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికుల పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై కేటీఆర్ ఆరా తీశారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈటీసీఏ ప్రతినిధులను కేటీఆర్ అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో ప్రవాస తెలంగాణ సంఘాల కృషి అభినందనీయమన్నారు. ఈటీసీఏ కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గల్ఫ్ కార్మికుల కష్టనష్టాల్లోనూ అండగా నిలుస్తూ ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు సహాయసహకారాలు అందిస్తున్న తీరు గొప్పదని కేటీఆర్ అన్నారు. గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాలతో చిక్కుకుపోయిన పలువురు తెలంగాణవాసుల సమస్యల పరిష్కారానికి కేటీఆర్ వ్యక్తిగతంగా ప్రత్యేక చొరవ చూపి వారిని స్వస్థలాలకు చేరుకునేలా చేసిన విషయాన్ని ఈటీసీఏ ప్రతినిధులు ఈ సందర్భంగా గుర్తు చేస్తూ కేటీఆర్ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

క్షుద్ర పూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం.. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం.. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటామన్నారు. హరీశ్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లనూ ధ్వంసం చేసి వోట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామికవాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు. కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన వస్తుందని స్పష్టం చేశారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం ఎజెండా పూర్తిగా రాష్ట్ర హక్కులను కాలరాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్‌ని సలహాదారుగా పెట్టుకోవడమే ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్‌ని తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామన్న బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముల్లు తో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

## బోనాల విశిష్టతని తెలియజేసిన వార్డు మెంబర్ వనిత

**డీ డీ 9 వార్త, ములుగు :**



లక్ష్మీదేవి పేట గ్రామ పంచాయతీ పరిధిలోని రాజేశ్వరరావు పల్లి అంగన్వాడీ కేంద్రంలో బోనాల పండుగ విశిష్టతను గ్రామ వార్డు మెంబర్ గాజుబోయిన వనిత, అంగన్వాడి టీచర్ కొండ మాధవి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ కు రూ.5 లక్షల విలువైన వ్యాధి నిర్ధారణ పరికరాలు

### ఐఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటరు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు



**భద్రాచలం, ఆగస్టు 8 డిడి9 వార్త**

తలసేమియా, సికిల్సెల్ ఎనిమియా రక్తహీనత వ్యాధిని అరికట్టేందుకు రూ.5 లక్షలు విలువ చేసే వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను అందజేసేందుకు భద్రాచలం ఐటీసీ పేపర్‌బోర్డ్ ఉన్నతాధికారులు సంసిద్దత వ్యక్తం చేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటరు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. ఈ మేరకు శనివారం భద్రాచలం ఐటిసి ఎస్పీడీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ వ్యాధి నిర్ధారణ పరికరములను అందజేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే అందజేస్తామని పేర్కొన్నారు. 2026-27 సంవత్సరమునకు రూ. 5లక్షల వ్యయంతో, 1800 వ్యాధి నిర్ధారణ పరికరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ డాఎస్. ఎల్.కాంతారావు, పాకాల దుర్గా ప్రసాద్, జి.రాజారెడ్డి, వై. సూర్యనారాయణ, బి. వెంకటరెడ్డి, వి.కామేశ్వరరావు, సిద్దారెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భవిత ప్రత్యేక అవసరాల పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ




**భద్రాచలం, ఆగస్టు 8 డిడి9 వార్త**

భద్రాచలంలోని భవిత ప్రత్యేక అవసరాల పాఠశాల విద్యార్థులకు శనివారం నోట్ పుస్తకాలు, పండ్లను రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షులు లచ్చిరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సహాయ సహకారాలతో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దారు కోట రవికుమార్, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శుభాకాంక్షలను తెలియచేసిన ఎమ్మెల్యే

**మణుగూరు.ఆగస్టు 8(డి డి 9వార్త)**



ఆదివాసీ ప్రజలందరికీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు. అడవిని, ప్రకృతిని, పర్యావరణాన్ని తమ జీవన విధానంలో భాగంగా చేసుకుని, తరతరాలుగా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, భాషలను కాపాడుకుంటూ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్న ఆదివాసీ సోదర, సోదరీమణులకు ఈ ప్రత్యేకమైన రోజున శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి మరియు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఆదివాసీ కుటుంబానికి చేరేలా చూడటమే నా లక్ష్యం అని, ఆదివాసీ సంస్కృతి మన గర్వం... ఆదివాసీ సంప్రదాయాలు మన వారసత్వం... ఆదివాసీ అభివృద్ధి మన బాధ్యత! ప్రతి ఆదివాసీ కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామని ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆదివాసీలు అడవితల్లి బిడ్డలు

- ఆదివాసీలు ప్రతి ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఊరురా ఘనంగా నిర్వహిస్తున్నారు.
- ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1994లో గుర్తించింది.

**తాడ్వాయి DD9 వార్త**



డాక్టర్ అరుణ్ కుమార్
ఉస్మానియా యూనివర్సిటీ
ఆదివాసీ రచయిత
9676530496

ప్రకృతిలో మమేకమై జీవించేవారు. వీరి భాష, సంస్కృతి సాంప్రదాయాలు ప్రత్యేకమైనవి. ఆచారాలు, కట్టుబాట్లు, జీవన విధానం ఇలా ప్రతిదీ ప్రకృతి ఆధారంగా రూపుదిద్దుకున్నాయి. ప్రకృతే వీరి జీవితం, ప్రకృతే వీరి ఆధారం, ప్రకృతే వీరి ఆరాధన. ప్రకృతి తత్వమే వీరి తత్వం ఉత్పత్తిని కొలిచే సంస్కృతి ఆదివాసులది. వీరి ఆచారాల్లో ప్రకృతి ప్రతిబింబిస్తుంది. చెట్టుకు, పూటకు, పండుకు, కాయకు పూజలు చేస్తారు. పేర్లు, ఇంటి పేర్లు పక్షులు, జంతువులు, చెట్ల పేర్ల మీదుగా పేర్లు పెట్టుకుంటారు. సామూహిక జీవనం, సమిష్టి శ్రమ, సమన్యాయ సూత్రాలతో బ్రతుకుతారు. ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీలు కొండలను, అడవులను ఆసరా చేసుకుని జీవించేవారు కొందరుండగా, మరికొందరు సముద్రపు ఒడ్డున, ద్వీపకల్పాల్లో జీవిస్తున్నారు. ఐదు వేయిలకు పైన ఆదివాసి తెగలున్నాయి. నాలుగు వేయిలకు పైగా భాషలు మాట్లాడుతున్నారు. వీరు దాదాపు 90 దేశాల్లో ఉన్నారు. వీరి భౌగోళిక పరిస్థితులను బట్టి ఆదివాసీలను అమెరికాలో రెడ్ ఇండియన్లు, థాయిలాండ్ లో హిల్ ట్రైబ్స్, భారత దేశంలో షెడ్యూల్ తెగలు, సైబీరియాలో అల్పసంఖ్యాక తెగలు, చైనాలో నేషనల్ మైనారిటీస్, ఫిలిప్పీన్స్ లో అల్పసంఖ్యాక తెగలు, ఇండోనేషియాలో ఏకాంత వాసులు, మలేషియాలో ఎబార్జిన్లు, పాకిస్థాను ట్రైబల్ అని అధికారికంగా పిలుస్తున్నారు. వివిధ దేశాలలో రక రకాలుగా పేర్లతో పిలిచినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా వీరిని ఇండివిజినెస్ పీపుల్స్ గా పిలుస్తున్నారు. ఆదివాసీలకు ఈదినోత్సవం పవిత్రమైనది. గొప్ప పండగ లాంటిది. డోలిమోతలు, కొమ్ము, గుసాడి, దింసా నృత్యాలతో అడివంతా మారుమోగి పోతుంది. జెండా నినాదాలతో ప్రతిధ్వనిస్తుంది. యు పూలమాలలు, పచ్చని తోరణాలు, గజ్జల సవ్వడిలు రేలపాటలతో ఊరు ఊరంతా సంబరంలో మునిగి పోవడం, మేధావులు, కళాకారులు, యువతి యువకులు సభా సమావేశాలు నిర్వహించడం సహజమే. కానీ అసలు దినోత్సవం అంటే పూలమాలలు, జెండాలు, నినాదాలు, సభ, సమావేశాలు కాదు. ఆదివాసి హక్కులు పరిరక్షించడం, సంస్కృతి సాంప్రదాయాలు కాపాడడం, జీవన విధానాన్ని గౌరవించడం, భాషా ప్రాముఖ్యతను తెలియజేయడం, విద్య ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, సమాన అవకాశాలు కల్పించడం, సమాన గౌరవం అందించడం, వారి సమస్యల పైన అవగాహన కల్పించడం మొదలైన వాటిని మరువకుండా స్మరించుకోవడం. వాటిని సాధించుకోవడం. ఐక్యరాజ్యసమితి 1994 నుండి 2025 వరకు ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకమైన థీమ్ ను ఏర్పాటు చేస్తుంది. 1994 నుండి 2004 వరకు, 2004 నుండి 2014 వరకు ఉన్న కాలాన్ని ఆదివాసీ దశాబ్దాల కాలంగా గుర్తించింది. ఈ రెండు శతాబ్దాల కాలంలో అన్ని దేశాలు పరస్పరం సహ కారంతో మానవ హక్కులు, పర్యావరణం, విద్య, ఆరోగ్యం, సంస్కృతి సాంప్రదాయాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంకేతిక రంగంలో ప్రగతి సాధించడానికి కృషి చేయాలని ప్రకటించింది.

### ఆదివాసీ హక్కులను పరిరక్షించడం.

భూమి మీద, అడవి మీద, సహజ వనరుల పైన వారికి ఉన్న సాంప్రదాయ హక్కులను కాపాడటం. గౌరవప్రదమైన జీవనానికి భరోసా కల్పించడం. సంస్కృతి సాంప్రదాయాలు, భాషను పరిరక్షించడం. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి ప్రాథమిక అంశాలను అందరికి సమానంగా అందించడం. మాతృభాషలను నేర్చుకోవడం. జానపద కళలు, నృత్యాలు సాంప్రదాయ జ్ఞానాన్ని భావితరాలకు అందించడం. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, డిజిటల్ సదుపాయాలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందుబాటులో ఉండడం ద్వారా యువత ఆశయాలను నెరవేరుతాయి. గత మూడు దశాబ్దాలుగా ఐక్యరాజ్యసమితి ఈ కింది లక్ష్యాలు కోసం కృషి చేసింది. 2000 నుండి 2010 మధ్యకాలంలో ఆదివాసి సామాజిక, ఆర్థిక అభివృద్ధి విద్యా, ఆరోగ్యం, రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చింది. 2010 నుండి 2020 మధ్యకాలంలో భాషలు, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడింది. ఈ దశలలో ఆదివాసీ భాషలు, సంప్రదాయ జ్ఞానం, జీవన వైవిధ్యం, వాతావరణ మార్పులు పైన దృష్టి కేంద్రీకృతమైంది. ప్రకృతిని పరిరక్షించడంలో ఆదివాసుల పాత్రను ప్రపంచవ్యాప్తంగా గుర్తించడం జరిగింది. 2019వ సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి ఆదివాసి భాషల దినోత్సవంగా గుర్తించింది. ఈథీమ్ ద్వారా భాషల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత లభించింది. కాలగర్భంలో కలిసిపోతున్న భాషలను పరిరక్షించడానికి కృషి చేసింది. 2021 సంవత్సరం థీమ్ ఎవరినీ వెనుక వదిలకుండా స్వదేశీ ప్రజలు మరియు కొత్త సామాజిక ఒప్పందం కోసం పిలుపు. 2022 సంవత్సరం థీమ్ సాంప్రదాయ జ్ఞాన పరిరక్షణలో ఆదివాసీల మహిళల పాత్రలు. 2023 సంవత్సరం థీమ్ స్వయం నిర్ణయాధికారంలో మార్పులకు ప్రతినిధులుగా ఆదివాసి యువత. 2024 సంవత్సరం థీమ్ ఒంటరిగా జీవించే ఆదివాసి సమూహాల హక్కుల పరిరక్షణ. 2025 థీమ్ సంవత్సరం ప్రకృతి మేధస్సు యుగంలో ఆదివాసీల హక్కులు భవిష్యత్తు నిర్మాణం. ఈ విధంగా ప్రతి ఏటా ఒక కొత్త థీమ్ ను ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసింది. మూడు దశాబ్దాలుగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ థీమ్ లు ఒకే సందేశాన్ని బలంగా చెబుతుంది. ఆదివాసి హక్కులను గౌరవించకుండా వారిని భాగస్వామ్యం చేయకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టంగా తెలిపింది. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడం వల్ల ఆదివాసులు అభ్యున్నతి జరుగుతుంది. 2026 సంవత్సరం థీమ్ ఆదివాసీ మంత్రసానిని గౌరవించడం , వారి శ్రేయస్సు కృషి చేయడం. ప్రసవ నిపుణురాలు, ఆరోగ్య వైద్యులురాలు మంత్రసాని. పూర్వకాలంలో ప్రసవాలు సాధారణంగా జరిగేవి. ఆదివాసీ ప్రాంతాల్లో అనుభవజ్ఞులైన మహిళలు ప్రసవాలను నిర్వహించేవారు. వారినే మంత్రసాని అంటారు. వీరు ప్రసవ జ్ఞానం పెద్దల నుండి ఒక తరం నుండి మరొక తరం సంక్రమిస్తుంది. అనుభవంతో నేర్చుకున్న నైపుణ్యం తల్లి నుంచి కూతురుకి, అత్త నుంచి కోడలికి లేదా గ్రామంలోని పెద్ద మహిళ నుంచి మరో మహిళకు ఈజ్ఞానం అందించబడుతుంది. కొన్ని సంవత్సరాలుగా ప్రసవాల దగ్గర సహాయకురాలుగా పనిచేసిన తర్వాతే ఒక మహిళను పూర్తిస్థాయి మంత్రసానిగా గ్రామం గుర్తిస్తుంది.

పూర్వకాలంలో మంత్రసానులను ప్రసవ డాక్టర్ గా పిలిచేవారు. ఈమెకు ఆదివాసి సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, తల్లి, బిడ్డలకు ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తుంది. ఈమె సేవలు ఎంతో విలువైనవి, ప్రపంచమే గుర్తించదగినవి. ఈమె సేవా దృక్పథం, మానవత్వం, సమానత్వం అనే లక్షణాలు వల్ల ఆదర్శ మహిళగా గుర్తించబడుతుంది.

గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని గమనించడం, ప్రసవ సమయం అంచనా వేయడం, ప్రసవ ఏర్పాటు చేయడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని సిద్ధం చేయడం, ప్రసవ సమయంలో తల్లికి ధైర్యం చెప్పడం, శిశువు సంరక్షంగా జన్మించేలా సహాయం చేయడం, తల్లి శిశువు ఆరోగ్యాన్ని పరిశీలించడం, ప్రసవానంతరం విశ్రాంతి, ఆహారం గురించి సూచనలు ఇవ్వడం మొదలైనవి మంత్రసాని యొక్క ప్రధాన బాధ్యతలు. అలాగే తల్లి శిశువులకు ఆరోగ్యంగా ఉండడానికి తీసుకునే సాంప్రదాయ పద్ధతులు ప్రత్యేకమైనవి. వేడి నీళ్లతో శుభ్రం చేయడం, వనమూలికలతో స్నానం చేయిస్తారు. పండ్లు పలాలు, దుంపలు మంచి పోషకాహారం ఉన్న వాటిని అందిస్తారు. తల్లి శరీరానికి మర్దనం చేయడం కూడా సంప్రదాయం ఉంటుంది. ఈ పద్ధతులు ఆరోగ్యంగా ఉండడానికి ఎంతో ఉపయోగపడతాయి.

మంత్రసానులు ప్రస్తుతం కాలంలో అనేక సమస్యలను, సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వీరి సేవకు గౌరవం లేకపోవడం వల్ల చిన్నచూపు గురవుతున్నారు. తగిన ఆర్థిక వేతనం లేక చాలా కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయి. ధాన్యం, పండగ సమయంలో కొత్త బట్టలు తప్ప మరేమీ లభించదు. ప్రసవ కబురు వచ్చిందంటే ఎండనక, వాననక, పగలనకా రాత్రనకా అడవి దారుల గుండా వెళ్లాల్సిందే. రవాణా సౌకర్యం లేనందున ఎంత దూరమైనా కాలినడకె. చేతి తొడుగులు, శుభ్రమైన కిట్టు, మందులు, ప్రాథమిక సామాగ్రిని కొనుగోలు చేయడానికి కూడా ఆర్థిక స్తోమత ఉండదు. కొన్ని సందర్భాల్లో తన స్వంత డబ్బులతో ఆధునిక వైద్య పరికరాలను కొనాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తమ జీవనాన్ని మరింత కునిపోయేలా చేస్తున్నాయి. ప్రస్తుత కాలంలో ప్రభుత్వాలు తల్లి శిశువుల ఆరోగ్యం పైన ప్రత్యేక దృష్టి పెట్టాయి. తల్లి మరణాలను, శిశువుల మరణాలను తగ్గించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. గర్భిణీలకు ఉచిత వైద్య పరీక్షలు, ప్రసవ సేవలు, టీకాలు, పోషకాహారం, అత్యవసర రవాణా వంటి సౌకర్యాలు కల్పిస్తుంది. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, నర్సులు, వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయించుకోవడానికి ప్రోత్సహిస్తున్నారు. సాంప్రదాయ మంత్రసానులకు శిక్షణ ఇచ్చి ప్రమాద సూచనలు గుర్తించడం, అవసరమైతే వెంటనే ఆసుపత్రికి పంపించిన వంటి అంశాలపై అవగాహన కనిపిస్తున్నారు. దీని వల్ల సంప్రదాయ అనుభవం మరియు ఆధునిక వైద్య సేవలు మధ్య సమన్మయం ఏర్పడుతుంది. ఆసుపత్రులకు దూరంగా ఉన్న గర్భిణీలకు మంత్రసాని అందుబాటులో ఉండడం వల్ల మానసిక ధైర్యం కలుగుతుంది. మంత్రసాని ఆధునిక వైద్య వ్యవస్థలో అనుసంధానం చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చు. సాంప్రదాయ జ్ఞానానికి వారసులు మంత్రసాని. మంత్రసానులను గౌరవించడం అంటే ఆదివాసీ సాంప్రదాయ జ్ఞానాన్ని గౌరవించడమే. వారి జ్ఞానాన్ని, అనుభవాన్ని భద్రపరచడం. సేవ చేసే వారికి గౌరవం దక్కకపోతే ఆజ్ఞానం భావితరాలకు అందే అవకాశం కూడా తగ్గిపోతుంది. అందువల్ల మంత్రసానుల శ్రేయసు ప్రభుత్వం, ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థలు సమాజం కలిసి పని చేయవలసిన ఆవశ్యకత ఉంది. వారికి తగిన వేతనం కల్పించాలి, సామాజిక భద్రత కల్పించాలి, ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలి. ఈ విధంగా వారి శ్రేయస్సుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

# అడవి బిడ్డల అరణ్యరోదన.. అస్తిత్వం కోసం ఆదివాసుల పోరుబాట

- - అరకొర నిధులతో నెట్టుకొస్తున్న భద్రాచలం ఐటీడీఏ
- పోలవరం ముంపుతో ఆగమాగమైన బతుకులు
- నేడు భద్రాచలంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**భద్రాచలం, ఆగస్టు 8 (డిడి9 వార్త)**




అమాయకత్వానికి పెట్టింది పేరైన ఆదివాసీల అడవితల్లిపై హక్కులు ఒక్కొక్కటిగా చేజారిపోతుండటంతో వారు తమ ఉనికిని, అస్తిత్వాన్ని కోల్పోయి తల్లడిల్లుతున్నారు. ఒకప్పుడు జల్, జంగల్, జమిన్‌లను స్వేచ్ఛగా అనుభవించిన మూలవాసులు.. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో అడవుల నుంచి తరిమివేయబడుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అనాదిగా సాగు చేసుకుంటున్న పోడు భూములపై అటవీశాఖ అధికారుల దాడులు, కేసులు బనాయించడం పెద్ద సమస్యగా మారుతోంది. గతంలో ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వాలు మారిన తర్వాత క్షేత్రస్థాయిలో సాగుదారులపై మళ్లీ దాడులు జరుగుతున్న సంఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి.

### అరకొర నిధులతో అస్తవ్యస్తం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం 1975 మార్చి 12న ఏర్పాటు చేసిన భద్రాచలం ఐటీడీఏ నేటికి అర్ధ శతాబ్దం పూర్తి చేసుకున్నా.. ఆదివాసీల పరిస్థితి మాత్రం "ఎక్కడ వేసిన గొంగలి అక్కడే" అన్నట్లుగా తయారైంది. వేల కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నా వాటి ఫలాలు ఆశించిన స్థాయిలో అందడం లేదు. ట్రైకార్ ద్వారా యూనిట్ల అందజేత నిలిచిపోవడం, వ్యవసాయం, విద్యుత్, సాగునీటి రంగాలకు కేటాయింపులు నామమాత్రంగానే ఉండటంతో ఐటీడీఏ కేవలం ప్రభుత్వ గ్రాంట్లపైనే నెట్టుకొస్తోంది. ప్రత్యేక కేంద్ర పథకాల నిధులు కొరవడటంతో ఆర్థిక లేమితో సతమతమవుతోంది.

### పోలవరంతో అగమ్యగోచరం..

భద్రాచలం ఏజెన్సీకి శాపంగా మారిన పోలవరం ప్రాజెక్టు కారణంగా డివిజన్‌లోని చింతూరు, వీఆర్‌పురం, కూనవరం తదితర ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్లోకి వెళ్లడంతో ఆ ప్రాంత గిరిజనుల బతుకులు ఆగమాగమయ్యాయి. ప్రాజెక్టు పూర్తై పూర్తిగా నీటి నిల్వ ప్రారంభమైతే ఈ ప్రాంతాలు పూర్తిగా ఖాళీ చేయాల్సి రావడంతో, ఆదివాసీల అనాది సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల భర్తీ అటకెక్కడంతో గిరిజన యువత ఉపాధి కోసం మైదాన ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

### నేడు ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు..

ఈ నిరాశ, నిస్పృహల నడుమ నేడు భద్రాచలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భద్రాచలంతో పాటు చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల్లోనూ ఈ వేడుకలు జరగనున్నాయి. భద్రాచలంలో మణ్యం వీరులకు నివాళులు, భారీ ర్యాలీ, అన్నదానం, గిరిజన భవనంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో బి.రాల్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుతో పాటు పలువురు ప్రముఖులు, ఆదివాసీ సంఘాల నాయకులు హాజరుకానున్నారు.

# గ్రామ గ్రామాన ఆదివాసీలు ఆకుపచ్చని జెండాలను ఎగుర వేయాలి

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి
- Asu రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్

**తాడ్వాయి డిడి9 వార్త**



ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9 కార్యక్రమాన్ని ప్రతి ఆదివాసీ గుండెలో ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసి విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది.

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకుంటూ. ప్రత్యేక జీవన విధానం కొనసాగిస్తూ తమ హక్కులు, చట్టాల అమలు కోసం ఆత్మగౌరవం,తో జల్–జంగల్–జమీన్ కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, హక్కుల పరిరక్షణకు ప్రతీకగా నిలవాలని వారు అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గ్రామాల నుంచి ఆదివాసీ ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఆదివాసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. "ఆదివాసీ ఐక్యతే మన బలం – హక్కుల పరిరక్షణే మన లక్ష్యం" అనే నినాదంతో అందరూ ఐక్యంగా పాల్గొనాలని ఆదివాసీ విద్యార్థి సంఘం విజ్ఞప్తి చేసింది.

# కంప్యూటర్ ఆపరేటర్లకు సూపర్ న్యూమరీ పోస్టులు ఇచ్చి సర్దుబాటు చేయాలి

- తహసిల్దార్ కార్యాలయాల్లో గత కొన్నేళ్లుగా సేవలు చేస్తున్నాం
- మమ్మల్ని తొలగించడం బాధాకరం
- కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు రమేష్

**ములుగు, డీ డీ 9 వార్త :**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయాల్లో తాము గత కొన్ని ఏళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నామని, అలాంటి మమల్ని తొలగించడం సరైంది కాదని కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు భూపెల్లి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.నిరుపేద కుటుంబాలకు చెందిన తాము గత 20 ఏళ్లుగా తహసీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. అలాంటి మమల్ని నిర్లక్షణంగా తొలగించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయాల్లో సర్టిఫికెట్లతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రతి పనిని తామే చేశామని తెలిపారు. ఎన్నికల్లో గెలిచాక



తాత్కాలిక ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం చేయకపోవడంతో పాటు తొలగించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గత కొన్ని నెలలుగా చేసిన పనికి సైతం జీతాలు రాలేదని, అప్పులు చేసి మరి కుటుంబాలను పోషించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రెవిన్యూ శాఖలో సుమారు 5వేలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీఆర్ఏలకు అవకాశం ఇచ్చిన విధంగా తమ 20 ఏళ్ల సేవలను దృష్టిలో ఉంచుకొని సూపర్ న్యమరి పోస్టులు ఇచ్చి కంప్యూటర్ ఆపరేటర్లను సర్దుబాటు చేయాలని ఆయన కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి కంప్యూటర్ ఆపరేటర్లకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.

# సమ సమాజం దిశగా కవిత సమరశంఖం

**డీ డీ 9 వార్త, ములుగు :**

హైదరాబాదులో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉపన్యాసం చూసాక తెలంగాణ రాజకీయాలు సామాజిక మార్పు కేంద్రంగా సాగనున్నాయా అన్న చర్చ మేధావి వర్గంలో మొదలైంది. తాను అగ్రవర్ణంలో పుట్టినప్పటికీ తన పుట్టుక తన చేతుల్లో లేదని కానీ తన జీవితం అంతా బడుగుల కోసం అంకితమిస్తానని అమె అన్న మాటలు సహజంగానే ఆసక్తి కలిగించాయి. తాను అంకితమవు తానని చెప్పడమే కాదు సమాజం లో వచ్చిన పెను మార్పులన్నింటిని తీసుకురావడంలో అగ్రవర్ణాలు కలిసి ముందుకు నడిచారని అన్నారు. బుద్ధుడు, సాహు మహరాజ్ నుండి వీపీ సింగ్ దాకా ఉటంకిస్తూ అగ్రవర్ణాల వారు కూడా సామాజిక న్యాయ సాధనలో దళిత బహుజనులకోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. సామానత్వం వచ్చేసింది అంటున్న వాళ్లలో ఎంత మంది తమ కన్నా ఎక్కువ వివక్ష ఎదుర్కుంటున్న కింది కులాలను తమ ఇంటికి భోజనానికి పిలుస్తున్నరని ప్రశ్నించారు. సమానత్వం అంటే ఏవొ కొన్ని రిజర్వేషన్లు ఇచ్చి అందరం సమానం ఐపోయామని అనడం సరి కాదు అని, మనతో సమానంగా చూసే హృదయ పరివర్తన రావాలి కదా అన్నారు. కవిత మాటల్లో కొంత సిన్సియారిటీ కన్పిస్తున్నదనీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సహజంగానే కవిత మాట్లాడిన మాటలు లెఫ్టిస్టులు, అంబేద్కరిస్టులు విశ్వసిస్తారా లేదా అన్న విషయం పక్కన బెడితే రానున్న రోజుల్లో తన మార్గమేమితో ఆమె విస్పష్టంగానే చెప్పారు. అందుకు మానసికంగానూ సిద్ధమైనట్టే తాను కనిపిస్తుంది. నిజానికి సామాజిక న్యాయ ఉద్యమాలు ఈ నాటివి కావు. తరతరాలుగా ఎలా ఐతే ఈ దేశంలో కులం వేళ్లూనుకు పోయిందో అలాగే ప్రతిస్పందనగా సామాజిక ఉద్యమాలు ఎప్పటికప్పుడు వస్తూ ఉన్నాయి. మలి దశ తెలంగాణ పోరు తొలినాళ్లలో సీపీయూఎస్ఐ వ్యవస్థపకుడు కా. మారోజు వీరన్న చెప్పిన కులాల సాధికరత, తిరుగు




బాటుతొ ఇది సమకాలీన రాజకీయాలలో పెద్ద యెత్తున చర్చకు వచ్చింది. అందుకోర గుత్పందుకో అని గర్జించిన మారోజు అమరుడైనా ఆయన ధ్యేయం సమానత్వం. ఆయన మార్గం ధర్మ యుద్ధం. అదే దారిలో తెలంగాణలో రాజకీయ మార్పులను బేరిజు వేస్తున్నాము. ఆధునిక భారతదేశంలో కుల వివక్ష భౌతిక, సామాజిక మరియు ఆర్థిక రూపాల్లో వ్యక్తమవుతోంది. పవిత్రత మరియు అపవిత్రత అనే భావన ఈ వివక్షకు ప్రధాన ప్రాతిపదికగా పెట్టుకొని కొందరిని అపవిత్రులుగా ముద్రవేయడం ద్వారా తాగునీటి వనరులు, దేవాలయాలు, రోడ్ల వంటి బహిరంగ ప్రదేశాల వినియోగంపై నిషేధాలు విధించబడ్డాయి. ఆధునిక నగరాల్లో బహిరంగంగా అస్పృశ్యత లేనట్టే కనిపించినా ఇళ్ల అద్దె, సామాజిక సంబంధాలు మరియు కులాంతర వివాహాల పట్ల వ్యక్తమయ్యే వ్యతిరేకతలో ఈ భావజాలం మనకు కనిపిస్తుంది. భారతీయ సామాజిక నిర్మాణంలో కుల వ్యవస్థ అనేది కొన్ని వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అత్యంత క్లిష్టమైన వర్గీకరణ రూపం. ఇది కేవలం ఆచార వ్యవహారాలకు పరిమితమైన వ్యవస్థ మాత్రమే కాక, సమాజంలో వ్యక్తుల అంతస్తు, వృత్తి, ఆర్థిక అవకాశాలతో పాటు ఆఖరికీ కులాల వారీగా నివాసం ఉండే వారకు ఇది విస్తరించింది. అలాగే రాజకీయ అధికారాలను నిర్ణయించే ఒక వ్యవస్థీకృత ముఠాగా కులం పని చేస్తోంది. శతాబ్దాలుగా ఈ వ్యవస్థ పొందిన రూపాంతరాలు, వలస పాలనలోని మార్పులు ఇన్నీ అన్నీ కావు. స్వతంత్ర భారత దేశంలో ఈ వివక్షలకు, నష్టాలకు రాజ్యాంగ పరిహారాలు ఉన్నప్పటికీ కుల వివక్ష తన రూపాన్ని మార్చుకుంటూ ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలోనూ తీవ్రమైన తిరోగమన ప్రభావం చూపుతోంది. కుల రక్కసిపై వేల వేల బల్లాలతో తిరగ బడ్డ జన సమూహాన్నీ మేము కలలు కంటున్నాం. కులం లేని వివక్ష లేని సమరసత ప్రతీ చోట ప్రేమను నింపాలని మేము కోరుకుంటున్నాం. చివరగా నిన్నటి సభలో సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెప్పడమే కాదు బీసీ రిజర్వేషన్ల కోసం అవసరమైతే రాష్ట్రంలో వివిధ జిల్లా కేంద్రాలలో వరుస సభలతో పాటు పార్లమెంటు సమావేశాలకు ముందు డిల్లీలో ధర్నాలకు దిగుతామని ఆమె అన్నారు. భారీగా వాహనాలలో డిల్లీ చేరుకుంటామని చెప్పడంతో తాను గతంలో జంతర్ మంతర్ వద్ద భారీ స్థాయిలో మహిళా రిజర్వేషన్ల సమయంలో చేసిన ధర్నా గుర్తొచ్చింది. కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి నిర్మాణం, పోరాట పటిమ కలిగిన నాయకురాలు కవిత. ఒక కార్యక్రమం తీసుకుంటే పగడ్బందీగా కార్యాచరణ చేసుకోగలదు అన్నది వెలుగుమట్ల నుండి నేరెళ్ల దాకా చుస్తునే ఉన్నాము. భారత బహుజన విప్లవోద్యమ నిర్మాత కా. మారోజు వీరన్న చూపిన దారిలో నిన్నటి కల్వకుంట్ల కవిత ఉపన్యాసాన్ని స్వాగతిస్తున్నాము. ఏదేమైనా కవిత తీసుకున్న వైఖరిని కేవలం ఒక పార్టీ విధానం గా భావించడం లేదు. తెలంగాణ రాజకీయాలలో ఒక పెను మార్పుకు నాంది కావాలని ఆశిస్తున్నాము. మరిన్ని పార్టీలు ఈ విధానాలతో ముందుకు రావాలని కోరుకుంటాము. సామాజిక న్యాయ దివిటీ మరింత గొప్పగా వెలగాలని అకాంక్షిస్తున్నామని సిపియుఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న తెలిపారు.

# తాత్కాలిక నిత్యకల్యాణ వేదికలోకి రామాలయ నిత్యకల్యాణాల మార్పు

**ప్రస్తుత నిత్యకల్యాణ మండపం కూల్చివేత**

**భద్రాచలం, ఆగస్టు 8 డిడి9 వార్త**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రస్తుతం ప్రతి రోజు నిత్యకల్యాణాలు నిర్వహిస్తున్న నిత్యకల్యాణ మండపం, బేడా మండపాలను అధికార్యులు తొలగించారు. దీంతో మిథిలా స్టేడియంలో తాత్కాలిక నిత్యకల్యాణ వేదికను సిద్ధం చేసి శనివారం నుంచి నిత్యకల్యాణాలను ఇక్కడ నిర్వహించడం ప్రారంభించారు. ముందుగా ఉదయం తాత్కాలిక



నిత్యకల్యాణ వేదిక వద్దకు స్వామి వారిని మేళతాళాలు, భాజభజంత్రీల నడుమ దేవస్థానం ఈవో కె.దామోదర్ రావు ఆధ్వర్యంలో వైదిక బృందం తీసుకొచ్చారు. అనంతరం నూతన నిత్యకల్యాణ వేదిక వద్ద సంప్రోక్షణ, మంత్రపుష్పం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం తాత్కాలిక నిత్యకల్యాణ వేదికపై శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆసీనులను చేసి నిత్యకల్యాణంను కొనసాగించారు. కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను నిర్వహించారు. కల్యాణం అనంతరం కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామి వారి మూలవరుల దర్శనంతో పాటు, అన్నప్రసాద సౌకర్యం కల్పించారు. ఇకపై ప్రతి రోజు నిత్యకల్యాణాలు ఇక్కడే కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో రామాలయ స్థానాచార్యులు కేఈ స్థలశాయితో పాటు వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

## ఎమ్మెల్యే కడియం శ్రీహరికి సర్పంచుల వినతి



**జనగామ ఆగస్టు 8(డిడి 9 వార్త )**

రఘునాతపల్లి మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ పలువురు సర్పంచులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. పంచాయతీ భవనాలు లేని గ్రామాలకు భవనాలు మంజూరు చేయడంతో పాటు అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని గ్రామాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సర్పంచులు కోరారు. కార్యక్రమంలో రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, కుసుంబాయి తండా సర్పంచ్ కొర్ర స్వరూప రాజేందర్ నాయక్, బానోజ్‌పేట సర్పంచ్ గైని శ్రీనివాస్, ఆంధ్ర తండా సర్పంచ్ భూక్య శ్రీను, కోడూరు సర్పంచ్ లలిత సోమయ్య, గోవర్ధనగిరి సర్పంచ్ తోటకూర సదానందం, ఖీలేషాపూర్ సర్పంచ్ శాగా కవిత అశోక్, మేకలగట్టు సర్పంచ్ ఇల్లందుల రవి, శ్రీమన్నారాయణపురం సర్పంచ్ వెంకటేష్, మాదారం సర్పంచ్ సరిత మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# విషాదంలో అండగా నిలిచిన బీఆర్ఎస్

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



**మంగపేట ఆగస్టు08డీడీ9 వార్త**

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం చెరుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కూకట్ల చంటి తల్లి కూకట్ల సమ్మక్క అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు జిల్లా నాయకత్వం స్పందించింది. బీఆర్ఎస్ జిల్లా నాయకులు తాటి కృష్ణ, మాజీ మండల అధ్యక్షులు కుడుముల లక్ష్మీనారాయణ, చిట్టి మల్ల సమ్మయ్య, గుండేటి రాజు యాదవ్ చెరుపల్లి గ్రామానికి చేరుకుని సమ్మక్క పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి అయూబ్, మూగల రమేష్, గాదె శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుడివాడ శ్రీహరి, బిల్పాటి భాస్కర్, జాడి కృష్ణ, ముప్పారపు సందీప్, కొలుకుల దేవా, పిల్లి ప్రతాప్, కూకట్ల శ్రీను, కూకట్ల సురేష్, నరేష్, కమల్ సాయి, భాను, చంద్రరావు, తరుణ్, కొండల్, బాబు, ప్రశాంత్, వెంకటేష్, లక్ష్మయ్య తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపూర్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి



**జనగామ ఆగష్టు8(డిడి 9వార్త )బ్యూరో**

రఘునాథపల్లి మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముదిరాజు సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పండుగ సాయన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతి, ముదిరాజుల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ పెద్దచెరువు సర్పంచ్ గిరబోయిన సతీష్ ముదిరాజ్, ముదిరాజు పెద్దలు పండుగ ఉప్పలయ్య, నూనె ఉప్పలయ్య, నూనె మల్లేష్ పండుగ యాకన్న, శివర్ల కుమార్, పండుగ యాదగిరి యువత పండుగ శేఖర్, పులి కార్తీక్,పండుగ ప్రేమ్, నూనె గణేష్, దండు రాజు తదితరులు పాల్గొని జయంతి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

## కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన మల్లారెడ్డి



**జనగామ ఆగస్టు8(డిడి9 వార్త) బ్యూరో**

వావిలాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బ్లాక్ నాయకుడు పెంతల మల్లారెడ్డి ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండుగ సాయన్న ఆశయాలు స్ఫూర్తిదాయకం

### జనగామలో ఘనంగా జయంతి వేడుకలు

**జనగామ, ఆగస్టు 8 (డిడి 9 వార్త)బ్యూరో**



పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి, జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల పక్షాన నిలిచిన పండుగ సాయన్నను ప్రజలు ★తెలంగాణ రాబిన్‌హుడ్' గా గుర్తించారని తెలిపారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేపూర్ క్షత్రియ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు





**నిజామాబాద్ జిల్లా 08 ఆగస్టు(డీడీ9 వార్త) :**

ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ స్కూల్‌లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్జాపూర్ అర్చన–శ్రీనివాస్ దంపతులు జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఒగ్గు విజయలక్ష్మి మాట్లాడుతూ... బోనాలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తిన తీరు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనం అంటే అమ్మవారికి సమర్పించే నైవేద్యమని సంస్థ కోశాధికారి అల్జాపూర్ గంగాధర్ తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సెక్రటరీ దేవేందర్, డైరెక్టర్లు వీరేంద్ర, యశస్విని, జయంత్, ఐశ్వర్య, శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

### అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చ

**నిజామాబాద్ జిల్లా 08 ఆగస్టు(డీడీ9 వార్త) :**



నిజామాబాద్ జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భవేష్ మిశ్రాను నిజామాబాద్ అర్బన్ నాయకులు ధన్ పాల్ సూర్యనారాయణ కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిజామాబాద్ నగర అర్బన్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులు మరియు ప్రధాన ప్రజా సమస్యలపై ఇన్ చార్జి కలెక్టర్ తో ధన్ పాల్ సూర్యనారాయణ సుదీర్ఘంగా చర్చించారు. నగరంలో నెలకొన్న ప్రధాన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తూ.. వాటి వేగవంతమైన పరిష్కారానికి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్త మల్లూరులో రోడ్ల సమస్యపై కాంగ్రెస్ నాయకుల పరిశీలన

- ప్రజల సమస్యను రాజకీయం చేసి మంత్రి సీతక్కపై బురద జల్లడం తగదు.
- మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు
- మా వీడియోను వక్రీకరించి ప్రచారం చేసిన వ్యక్తి క్షమాపణ చెప్పాలి:

**మంగపేట ఆగస్టు08 డీడీ9 వార్త**



కొత్త మల్లూరు గ్రామంలో రోడ్ల దుస్థితిపై గ్రామ ప్రజలు రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపిన విషయం తెలుసుకున్న మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త మల్లూరు గ్రామాన్ని సందర్శించారు.గ్రామంలో నెలకొన్న రోడ్ల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి,సంబంధిత రోడ్డు వివరాలను సేకరించి,సమస్యపై ప్రజలకు అందుబాటులో ఉన్న వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లాతో పాటు మంగపేట మండల అభివృద్ధికి 51 కోట్ల రూపాయలు కేటాయించి,ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.మంగపేట మండలంలో స్థానిక పాలకవర్గాలు లేని పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని,పంచాయతీరాజ్ శాఖ ద్వారా పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రత్యేకంగా కొత్త మల్లూరు గ్రామానికే 40 లక్షల రూపాయలు కేటాయించి CC రోడ్ల నిర్మాణాలు ప్రారంభించారు. “ఏ గ్రామంలోనూ కనీసం ఒక రోడ్డు కూడా అభివృద్ధికి నోచుకోకుండా ఉండకూడదు.ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు ఉండాలి.గ్రామాలు అభివృద్ధి చెందాలి” అనే లక్ష్యంతో మంత్రి సీతక్క ముందుకు సాగుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.ఇప్పటికే అనేక గ్రామాల్లో సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నారని తెలిపారు. అయితే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంటే జీర్ణించుకోలేని కొందరు బీఆర్ఎస్ నాయకులు,ప్రజల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ మంత్రి సీతక్కపై బురదజల్లే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు.

**మా సమస్యను మాత్రమే వీడియో చేశాం:**

కొత్త మల్లూరు గ్రామ ప్రజలు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. తమ గ్రామంలో రోడ్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే తాము రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపామని స్పష్టం చేశారు. “మేము మా గ్రామ రోడ్డు సమస్యకు సంబంధించిన వీడియో మాత్రమే తీసి మా గ్రూపులో పెట్టాం.మంత్రి సీతక్క ని తప్పుగా ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.కాంగ్రెస్ పార్టీని కూడా విమర్శించలేదు.కానీ మా అనుమతి లేకుండా మా వీడియోను తీసుకుని ఎడిట్ చేసి,వేరే విధంగా మార్చి,మంత్రి సీతక్క ని కించపరిచే విధంగా ‘సీతక్క ఇలాకాలో’ అంటూ ప్రచారం చేయడం సరైంది కాదు”అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వీడియోను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తి వెంటనే గ్రామ ప్రజలకు,మంత్రి సీతక్క కి క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తమ హక్కు అని,అదే సమయంలో ప్రజల అసలు మాటలను వక్రీకరించి రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం ఎవరికీ తగదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.కొత్త మల్లూరు రోడ్డు సమస్యను రాజకీయ రచ్చగా కాకుండా,పరిష్కరించాల్సిన ప్రజా సమస్యగా చూడాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య,మండల యూత్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ,శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన చైర్మన్ యర్రంగారి సురేష్,శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ పూజారి సమ్మయ్య,జిల్లా మత్స్య పారిశ్రామిక ప్రధాన కార్యదర్శి బట్ట రామారావు,శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన డైరెక్టర్ బోడ బొౌరయ్య,జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు జంగం భానుచందర్,మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ నూతిలకంటి రాజు,యూత్ ప్రధాన కార్యదర్శి బిలపాటి నరేష్,యూత్ కార్యదర్శి పాయం సతీష్,యూత్ ప్రచార కార్యదర్శి మూగల చంటి,మండల యూత్ సోషల్ మీడియా ఇంచార్జి భూక్యా కుమార్,గ్రామ కమిటీ అధ్యక్షులు మాటూరి నరసింహారావు, మండల నాయకులు మాటూరి పరమేష్, లక్ష్మీనారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకులు కంగనాల నాగ చైతన్య,కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

- వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- వైరా ఏసీపీ సారంగపాణి

**బోనకల్,ఆగస్ట్ 07,(డీడీ9 వార్త):**

మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులను గుర్తించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా ఏసీపీ సారంగపాణి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొంగర మధు, బోనకల్ సబ్ ఇన్‌స్పెక్టర్ మాచినేని రవి, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, వాహనదారుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించడమే స్పెషల్ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్



లేకుండా వాహనాలు నడపడం, వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బోనకల్ మండల కేంద్రంలో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడంతో వాహనదారులు అప్రమత్తమయ్యారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఇకపై కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

## ఆదివాసీ ఉత్సవ నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

- విఐపి లకు గిరిజన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలి
- ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

**భద్రాచలం, ఆగస్టు 8 (డిడి9 వార్త)**



భద్రాచలంలో ఆదివారం జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని, కార్యక్రమంకు హాజరయ్యే వీఐపీలకు, గిరిజనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలో ఆదివాసీ దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అంబేద్కర్ సెంటర్, పాత మార్కెట్ సెంటర్ దగ్గర ఉన్న మహనీయుల విగ్రహాల వద్ద జరిగే కార్యక్రమాలు, బ్రిడ్జి సెంటర్ వరకు నిర్వహించే ర్యాలీ సమయంలో గిరిజన భవనంలో జరిగే కార్యక్రమం వరకు ఎటువంటి లోటుపాట్లు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. గిరిజన భవనంలో నిర్వహించే ఆదివాసి సాంప్రదాయ ప్రకారము జరిగే పూజా కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలు, వివిధ పాఠశాలల బాలబాలికల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలు అయిపోయే వరకు పకడ్బందీ చర్యలు తీసుకునేలా అధికారులను నియమించడం జరిగిందని, జిల్లా అధికారులకు సంబంధించిన వాహనాలను పార్కింగ్ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏవో సున్నం రాంబాబు, టీపీ శ్రీనివాస్, ఏటీడీవో రాధమ్మ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

## ప్రజాసేవే లక్ష్యంగా.. ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలు

- రోగులకు పండ్ల పంపిణీ.. ప్రజల కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్ష

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 08(డిడి9 వార్త):**

ప్రజాసేవకు అంకితమై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలను బాన్సువాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ స్వగృహంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎంపీకి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా ప్రజాసేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఎంపీ సురేష్ షెట్కర్ ఆయురారో



గ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవలందించాలని నాయకులు ఆకాంక్షించారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్



కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్ బిన్ మోసీన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్, షాహబ్, రవీందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, గుడాల నగేష్, కొట్టం గంగాధర్, గోపాల్ రెడ్డి, నార్ల రవీందర్, ఎజాజ్, హకీమ్, నర్సన్నచారి, శివదయాళ్, వెంకన్న సేట్, రమేష్, కాశీరాం, షోయెబ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం..

- భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందిద్దాం
- ప్రతి ఇంటా మొక్క.. ప్రతి వీధిలో పచ్చదనం
- పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం: సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ



**భద్రాచలం , ఆగస్టు 8, డిడి9 వార్త**

పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన ఆహ్లాదకర ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ పిలుపునిచ్చారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, వృక్ష ప్రేమికులు, ప్రజలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో.. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం అంతకంటే ముఖ్యమని స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, ప్రజల్లో మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గౌరవ అతిథిగా భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణదొర హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలానికి ఆధ్యాత్మిక, పర్యాటకంగా ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు నిత్యం తరలివచ్చే పట్టణంలో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రధాన రహదారులు, ఆలయ పరిసరాలు, బస్‌స్టాండ్ ప్రాంతం, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, కాలనీలు, ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు.

మొక్కలు నాటి ఫొటోలు తీసుకోవడంతో కార్యక్రమాన్ని ముగించకుండా.. వాటిని పెద్ద వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, యువత, మహిళలు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని అన్నారు.

ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షిస్తే భద్రాచలం పట్టణంలో పచ్చదనం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. మొక్కలు పెరిగితే ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు స్వచ్ఛమైన గాలి అందుతుందని, పక్షులు, చిన్న జీవులకు ఆవాసం ఏర్పడుతుందని వివరించారు.మొక్కలు నాటిన తర్వాత వాటికి క్రమం తప్పకుండా నీరు అందించడం, పశువుల నుంచి రక్షించడం, అవసరమైన చోట రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్ సూచించారు. ఒక మొక్కను నాటి వదిలేయడం వల్ల ఆశించిన ఫలితం రాదని, అది చెట్టుగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని అన్నారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రస్తుతం విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని సర్పంచ్ పునేం కృష్ణదొర అన్నారు. గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాయని తెలిపారు.భద్రాచలంలో పర్యావరణ పరిరక్షణను ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లేందుకు గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కృషి అభినందనీయమని సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. పచ్చదనం కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా భక్తులు, స్థానిక ప్రజలు, ప్రయాణికులకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించేందుకు స్థానికులు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి కార్యదర్శి రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు డాక్టర్ గోళ్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, డాక్టర్ శివరామకృష్ణ, వీరయ్య, సంపత్, ఆలయ పూజారి విశ్వనాథం, కార్‌స్టాండ్ అధ్యక్షుడు, సభ్యులు, వృక్ష ప్రేమికులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, దాతలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. భద్రాచలాన్ని పచ్చని పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, కార్యాలయాల వద్ద, అందుబాటులో ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. మొక్కలు నాటడాన్ని ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ఉద్యమంగా కొనసాగించాలని కోరారు.

# దేశంలో కాంగ్రెస్ ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది..

- రానున్న రోజుల్లో బీజేపీ భూస్థాపితం కావడం ఖాయం
- పార్లమెంట్ లో మ్యాగీ నూడిల్స్‌లా రెండు మూడు నిమిషాల్లో బిల్లులు పాస్ చేస్తున్నారు.. ఎంపీల అభిప్రాయాలకు విలువలేదు
- డీలిమిటేషన్ పేరుతో బీజేపీ ముందస్తు రాజకీయ లబ్ధికి యత్నిస్తుంది. ప్రజల చేతిలో ఆ పార్టీ కూలడం ఖాయం
- బీజేపీ, బీఆర్ఎస్ దొంగదెబ్బలపై అప్రమత్తంగా ఉండాలి.. కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలి
- గ్రూపు రాజకీయాలకు తావులేకుండా కాంగ్రెస్ జెండా ఎగరేయడమే ఏకైక లక్ష్యంగా ముందుకు వెళ్లాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లాలి.
- రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం. – వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య
- దేశంలో కాంగ్రెస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య

**జనగామ ఆగష్టు 8(డిడి 9 వార్త) బ్యూరో**

అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ భూస్థాపితం కావడం ఖాయమని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం తథ్యమని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ, పట్టణ, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార మహోత్సవానికి శనివారం వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ గారు ప్రతి అంశంపై చివరి వరకు పోరాటం చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఆయనను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పేద విద్యార్థుల కోసం పోరాడుతున్న నాయకుడు రాహుల్‌గాంధీ అని అన్నారు. పేపర్ లీకేజీల వంటి సమస్యలపై పోరాటం చేస్తూ ప్రతిపక్షాలను, ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కీలకమైన బిల్లులను మ్యాగీ నూడిల్స్‌లా రెండు మూడు నిమిషాల్లోనే ఆమోదిస్తున్నారని కడియం కావ్య విమర్శించారు. బిల్లులపై ఎంపీల అభిప్రాయాలను, ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీ తమ రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించిన బిల్లులను దేశంపైన, దేశ ప్రజలపైన రుద్దే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. డీలిమిటేషన్ ప్రక్రియను తీసుకురావడం వెనుక బీజేపీ ముందస్తు రాజకీయ లబ్ధి పొందాలనే



ఉద్దేశం ఉందని ఎంపీ ఆరోపించారు. అయితే ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును ఎవరూ ప్రభావితం చేయలేరని అన్నారు. ఎంత పెద్ద పాము అయినా చలిచీమల చేతిలో చనిపోయినట్లే.. ప్రజల చేతిలో బీజేపీ కూలడం ఖాయమని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్‌కు ఆదరణ క్రమంగా పెరుగుతోందని, రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్‌కు మరింత మద్దతు ఇవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నాయని ఎంపీ ఆరోపించారు. అందువల్ల ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత ఉందన్నారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా కాంగ్రెస్ జెండాను ఎగురవేయడమే ప్రతి ఒక్కరి ప్రధాన లక్ష్యం కావాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక అభిమానంతో వరంగల్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుమారు 6,500 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ పాలనపై విశ్వాసాన్ని మరింత పెంచాలని సూచించారు. జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ధన్వంతి సమర్థవంతంగా పనిచేస్తున్నారని ఎంపీ ప్రశంసించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పార్టీ జిల్లా, పట్టణ, మండల, అనుబంధ సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కోరారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డా. కడియం కావ్య పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీకి ఒక సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. వ్యక్తిగత విభేదాలు, గ్రూపు రాజకీయాలను పక్కనపెట్టి కాంగ్రెస్ జెండా, పార్టీ విజయం కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య సూచించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షురాలు – డిసిసి ప్రెసిడెంట్ లకావత్ ధన్వంతి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ రాంబాబు, YTDA బోర్డు మెంబర్ లక్ష్మీ నారాయణ నాయక్, జనగామ మున్సిపల్ చైర్మన్ బాలమణి, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ వినయ్, స్టేషన్ ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి,జనగామ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చందర్ రెడ్డి,గుడి వంశీధర్ రెడ్డి మరియు అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, డిసిసి కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, ట్రెజరర్, అధికార ప్రతినిధులు, కార్యదర్శిలు, ఎగ్జిక్యూటివ్ ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## రజకుల హామీల అమలుకు డిమాండ్ ఎస్సీ జాబితా అంశంపై సీఎం స్పష్టత ఇవ్వాలి: గోపి రజక

**జనగామ,ఆగస్టు 8 (డిడి 9వార్త )బ్యూరో**

రజకుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి రాజ్యాంగబద్ధ న్యాయం చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక కోరారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడం, సంక్షేమ హామీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఏదునూరి నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి గోపి రజక, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబరాజు కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపి రజక మాట్లాడుతూ, ఎస్సీ జాబితా అంశం ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

**వృత్తిదారులకు కార్మిక హోదా ఇవ్వాలి**

రజక వృత్తిదారులను కార్మికులుగా గుర్తించి హెల్త్ కార్డులు, పింఛన్, ప్రమాద బీమా, జీవిత బీమా, పనిముట్లకు సబ్సిడీ అందించాలని జిల్లా అధ్యక్షుడు ఏదునూరి నరేష్ కోరారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.




## మిన్నంటిన బోనాల సంబరాలు

### పట్టువస్త్రాలు ధరించి బోనం ఎత్తిన చిన్నారులు







**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన బోనాల ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతోకొనసాగుతున్నాయి. వీధులన్నీ డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో మర్మోగుతున్నాయి. ఈ వేడుకల్లో ముఖ్యంగా ఐచ్చోడా మండలం లోని ప్రగతి పాఠశాల చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం**

పెద్దలతో పాటు చిన్నారులు కూడా ఎంతో ఉత్సాహంతో సంప్రదాయ దుస్తులు, పట్టు లంగా-ఓణీలు, పంచెలు ధరించి తలపై చిన్న చిన్న బోన ఎత్తుకుని ఆలయాలకు తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణ పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన మట్టి/రాగి పాత్రల్లో నైవేద్యం (పాయసం) ఉంచి, దానిపై జ్యోతి వెలిగించి చిన్నారులు భక్తిప్రపత్తులతో అమ్మవారి ఆలయాల వైపు అడుగులు వేశారు. డప్పు దెబ్బలకు అనుగుణంగా అడుగులు వేస్తూ, అమ్మవారికి సాకలు పోస్తూ చిన్నారులు చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంస్కృతీ పరిరక్షణ: చిన్నతనం నుంచే పిల్లలకు సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు తల్లిదండ్రులు వారితో బోనాలు ఎత్తించడం విశేషం. ఆలయ ప్రాంగణాలు అమ్మవారి నామస్మరణతో, భక్తుల సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. చిన్నారుల సంప్రదాయ రూపాలు, వారి భక్తిభావం ఉత్సవాలకు మరింత శోభను చేకూర్చాయి.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు జరగాలి

- ప్రతి నెలా క్రమం తప్పకుండా ఉచిత పరీక్షలు చేయించుకోవాలి
- మోర్తాడ్ హెల్త్ మేళాను పరిశీలించిన డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ



**నిజామాబాద్ జిల్లా 08 ఆగస్టు(డీడీ9 వార్త) :**

గ్రామీణ ప్రాంత గర్భిణులు సురక్షిత ప్రసవాల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ రాజశ్రీ పిలుపునిచ్చారు. మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రజల ఆరోగ్యం కొరకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, వార్డులు, ల్యాబ్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి వచ్చే గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి రక్తపోటు, రక్తహీనత నిర్ధారణ పరీక్షలను ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో డీఎంహెచ్ఓ స్వయంగా మాట్లాడి ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. పుట్టబోయే బిడ్డ, తల్లి ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం, ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలని హితవు పలికారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ సవిత, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ స్వాతి, ఉప విభాగ అధికారి సాయి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ దొంగల ముఠాకు సదాశివనగర్ పోలీసుల చెక్!

### అంతర్‌జిల్లా ముఠాలో ఐదుగురు అరెస్ట్.. నాలుగు బైక్‌లు స్వాధీనం

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 08(డిడి9 వార్త)**



బైక్‌లను చోరీ చేసి, నకిలీ నంబర్ ప్లేట్లతో వాటిని వినియోగిస్తున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాకు సదాశివనగర్ పోలీసులు చెక్ పెట్టారు.పక్కా సమాచారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన మూడు బైక్‌లతో పాటు నేరానికి ఉపయోగించిన మరో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల దర్యాప్తులో నిందితులు చోరీ చేసిన బైక్‌లకు నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చి, వాటిని వినియోగిస్తున్నట్లు గుర్తించారు.నిందితుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో వారిని అదుపులోకి తీసుకుని కేసును ఛేదించారు.బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సదాశివనగర్ పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, అభినందించారు.నేరాల నియంత్రణలో భాగంగా వాహనాల తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనాలు నడిపినా, చోరీలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## నస్రుల్లాబాద్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

### యువ శక్తితో ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం: మంథని సామ్యేల్ మాదిగ



**బాన్సువాడ, ఆగష్టు 08(డిడి9 వార్త):**

ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నూతన యువ శక్తితో మరింత బలోపేతం చేసేందుకు సంస్థాగత నిర్మాణాలను చేపడుతున్నామని కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్ చార్జి మంథని సామ్యేల్ మాదిగ తెలిపారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ 32 ఏళ్లుగా అనేక సామాజిక సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ మానవతా ఉద్యమంగా ఎదిగిందన్నారు. భవిష్యత్ లో మరిన్ని సామాజిక పోరాటాలు విజయవంతం చేసేందుకు విద్యావంతులు, యువత పెద్ద సంఖ్యలో ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమానికి నియోజకవర్గ పర్యవేక్షకులు కాదేపురం గంగన్న మాదిగ, మావురం శ్రీకాంత్ మాదిగ, సాయిలు మాదిగ హాజరయ్యారు. నూతన మండల అధ్యక్షుడిగా టేకుర్ల శేఖర్ మాదిగ, అధికార ప్రతినిధిగా ఎడ్ల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా టేకుర్ల సాయిలు, కోశాధికారిగా ఎర్రోళ్ల గంగారాం, మాదిగ యువసేన కన్వీనర్ గా కర్రోల్ల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఎడ్ల శంకర్, రొడ్డ వెంకట్, పోషయ్య హనుమాండ్లును ఎన్నుకున్నారు.

## సన్మానం పేరుతో తీసుకెళ్లి.. తప్పుడు ప్రచారం

### తనను సతీష్ గ్రూపులో చేరినట్లు చిత్రీకరించడం కుట్రే: తిగల హనుమాన్ గౌడ్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 08(డిడి9 వార్త):**

బాన్సువాడ నియోజకవర్గం కిష్టాపూర్ గ్రామంలోని 3వ వార్డు నాయకుడు తిగల హనుమాన్ గౌడ్‌ను కొందరు నాయకులు సన్మానం పేరుతో బలవంతంగా తీసుకెళ్లి, ఆయన సతీష్ గ్రూపులో చేరినట్లు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం కలకలం రేపింది.తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు పన్నిన కుట్రగా ఈ ఘటనను హనుమాన్ గౌడ్ అభిప్రాయపడ్డారు.సన్మానం పేరుతో తనను తీసుకెళ్లిన అనంతరం జరిగిన పరిణామాలను తెలుసుకున్న హనుమాన్ గౌడ్ వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిసి వివరించారు.తాను ఎటువంటి గ్రూపులోనూ చేరలేదని, తన అనుమతి లేకుండా తీసిన ఫొటోలను ఉపయోగించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు.అనంతరం జరిగిన విషయాలను ప్రజలకు తెలియజేస్తూ హనుమాన్ గౌడ్ ఒక వీడియోను విడుదల చేశారు.వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, తనపై జరుగుతున్న ప్రచారంలో నిజానిజాలను ప్రజలు గమనించాలని ఆయన కోరారు.ఈ ఘటన స్థానికంగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## మాజీ డిసిసిబి చైర్మన్ ని పరామర్శించిన. బోథ్ మాజీ ఎమ్మెల్యే. రాథోడ్ బాపురావు




**అదిలాబాద్ జిల్లా. తలమడుగు మండలం(. డిడి 9 వార్త)**

తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన. మాజీ డిసిసిబి చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి. మాతృమూర్తి. ముడుపు వెంకటమ్మ. గత రెండు రోజుల క్రిందట. చనిపోయారు. ఇట్టి విషయాన్ని బోత్ మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రక్షణ సేన. బోథ్ ఇంచార్జి. రాష్ట్ర పరిశీలకులు. రాథోడ్ బాపూరావు. తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి పరమర్శించి. మృతికి గల కారణాలను. అడిగి తెలుసు కున్నారు. వారి కుటుంబ సభ్యులకు. తన ప్రగడ సానుభూతి తెలియజేస్తూ వారికి మనోధైర్యం ఇచ్చారు. వీరి వెంట. తెలంగాణ రక్షణ సేన పార్టీ. మండల కన్వీనర్. నిమ్మల గజానన్. సీనియర్ నాయకుడు నాయకుడు. గడుగు పొచ్చన్న. జీవన్ రెడ్డి. శాస్త్రి. వెంకట్ రెడ్డి. స్వామి. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్పంచ్ ఆడే శీలా పుట్టినరోజు వేడుకలు

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, కాంగ్రెస్ మండల నాయకురాలు ఆడే శీలా పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు, అభిమానులు, బంధువుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆడే శీలా కేక్ కట్ చేయగా, అక్కడికి హాజరైన కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, స్నేహితులు, అభిమానులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు. సర్పంచ్‌గా ఆడే శీలా మరింత సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని వారు కోరుకున్నారు. ఈ వేడుకల్లో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, బంధువులు, స్నేహితులు, అభిమానులు పాల్గొని ఆడే శీలాకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మస్కే మాదవ్, ససానే మాదవ్ ఆడే జైపాల్, అర్షద్ ఖురోషి, రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్మీడియట్ కాలేజీల అనుమతులను రద్దు చేయాలి

- బిఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రిరాజుయాదవ్

**డీ డీ 9 వార్త, ములుగు :**




ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న శాఖల్లో ఒక ముఖ్యమైన శాఖ అయిన విద్యాశాఖలో ఫేక్ ఫైర్ ఎన్ఓసీలు సృష్టించడం చాలా దురదృష్టకరం. హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథన్ గారి సంతకాలు ఫోర్జరీ చేసి ఫేక్ ఫైర్ ఎన్ఓసీలు తయారుచేసి ఇంటర్ బోర్డుకు సమర్పించడం దుర్మార్గమైన చర్య. రంగనాథన్ గారి సంతకమే కాకుండా ఇంకా కొంతమంది ఉన్నతాధికారుల సంతకాలను కూడా ఫోర్జరీ చేసి ఫేక్ ఇన్వోసీలు సృష్టించి ఇంటర్ బోర్డు కు సమర్పించడం రాష్ట్రంలో విద్యా విధానం పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. ఈ ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ చోద్యం చూస్తున్నట్టు వ్యవ హరించడం అన్యాయం. ముఖ్యంగా స్వయంగా ముఖ్యమంత్రి గారి చూస్తున్న శాఖలో ఇలాంటి దారుణం జరగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ముఖ్యమంత్రి గారు వెంటనే ఫేక్ ఎన్ఓసిలకు సహకరించిన అధికారులను మరియు ఈ ఘాతుగానికి పాల్పడిన జూనియర్ కాలేజీలో యాజమాన్యం పై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని మరియు ఇంతటి ఘాతుకానికి పాల్పడిన ఇంటర్ కాలేజీల లైసెన్సులు రద్దుచేసి క్రిమినల్ కేసులు పెట్టాలని మొర్రి రాజు యాదవ్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి గారు చూస్తున్న శాఖలోనే ఇలాంటి సంఘటనలు జరుగుతే మరి మిగతా శాఖల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. విద్యాశాఖ మీద పూర్తి నియంత్రణ లేకనే ఇటువంటి ఫేక్ NOC బాగోతాలు నడుస్తున్నాయి. ఇంటర్మీడియట్ ప్రైవేట్ జూనియర్ కాలేజీల రెన్యువల్ అనుమతుల కోసం తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ TGBIEకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్స్ సమర్పించగా వాటిని పరిశీలించగా ఏకంగా 40 నుండి 50 నకిలీ ఎన్ఓసి పత్రాలు ఉన్నట్టు హైడ్రా గుర్తించడం జరిగింది. నిర్లక్ష్యపు భవనాల్లో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ఫేక్ ఎన్ఓసి సర్టిఫికెట్ సమర్పించిన కాలేజీల అనుమతులు రద్దు చేస్తూ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనియెడల బిఆర్ఎస్ పార్టీ మరియు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెలియజేయడం జరిగింది. నిజంగా ముఖ్యమంత్రి గారికి విద్యా వ్యవస్థ పట్లా చిత్తశుద్ధి ఉండి, దానిని బాగు చేయాలనే సంకల్పం ఉంటే ఇట్లా అక్రమార్గంగా ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి కాలేజీలు నిర్వహిస్తున్న యజమానులందరినీ అరెస్ట్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## పేరుకే కిరాణం..అమ్మేదంత మద్యమే..

### మొద్దు నిద్రలో ఎక్సైజ్ శాఖ

**అశ్వారావుపేట:ఆగస్టు08 ( డిడి 9 వార్త)**






అశ్వారావుపేట నియోజకవర్గంలోని మండల పరిధిలో గల గ్రామాలలో బెల్ట్ షాప్ ల వల్ల కుటుంబాలు చిన్న భిన్నం అవుతున్నాయి. మద్యానికి బానిసై యువత కుటుంబ పెద్ద చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారు.. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం బెల్టు షాపులను నిర్మూలిస్తున్నామని చెబుతున్న సంబంధిత అధికారులు మాత్రం. పెడచెవిన పెడుతున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో అన్ని గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంటే మద్యం మాఫియా మాత్రం అన్ని గ్రామాలలో బెల్టు షాపులు విచ్చలవిడిగా నడిపిస్తున్నారు. ఒక్క నియోజకవర్గ హెడ్ క్వార్టర్ అయినా అశ్వారావుపేటలోనే 100కు పైగా ఉంటే మిగతా ఒక్కో గ్రామంలో సుమారు 5 లేదా అంతకంటే ఎక్కువే బెల్టు షాపులు ఉన్నాయి.నిత్యం బెల్టు షాపుల యజమానులు జోరుగా మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం ఆశ చూపి యువతను చెడు మార్గంలో వెళ్లే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ఉదయం 5 గంటల నుండి మొదలుకొని అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ బెల్ట్ షాపుల దందా కొనసాగుతుంది. పల్లెల్లో ఈ బెల్ట్ షాపుల బారిన పడి కుటుంబాలు మొత్తం నాశనం అవుతున్నాయి.



**పేరుకే కిరాణం..అమ్మేదంత మద్యమమే**

గ్రామాల్లో కిరాణ దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో తెల్లవారే వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. దాంతో చుట్టుపక్కల ఉన్న వారికీ కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంకా గ్రామంలోపలికి వెళ్తే కిరాణ దుకాణాల్లో,సొంత ఇళ్లల్లో పెద్ద పెద్ద ఫ్రిజ్లు పెట్టుకొని మరీ విక్రయిస్తున్నారు. మద్యం మత్తులో అక్కడే ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో కిరాణ దుకాణాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తూ జనాల దగ్గర బాగానే డబ్బులు సంపాదిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

**మొద్దు నిద్రలో ఎక్సైజ్ శాఖ...**

అశ్వారావుపేట నియోజకవర్గం మండల పరిధిలోని గ్రామాలలో మద్యం ఏరులై పారుతున్న ఎక్సైజ్ శాఖకు కనీసం కనువిప్పు కూడా కలగడం లేదు. మామూళ్ల మత్తులో తేలియాడుతూ ఎవరు ఏమైపోతే తమకేమిటి తమకు నెలకు మామూలు వస్తే చాలు అన్నట్లుగా ఎక్సైజ్ అధికారులు ప్రవర్తిస్తున్నారు. అని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలలో మద్యాన్ని నిర్మూలించాల్సిన ఎక్సైజ్ అధికారులు మొద్దు నిద్రలో తమకేమీ పట్టనట్లుగా ఉంటున్నారని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులో తేలి ఆడుతున్న ఎక్సైజ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియోజకవర్గ లోని మండలాల వ్యాప్తంగా మూయించాలని పలు గ్రామాలలోని ప్రజలు స్వచ్ఛందంగా కోరుతున్నారు

## రైతులను వేధిస్తున్న వాతావరణ మార్పులు, మార్కెట్ ధరల అస్థిరత

- పెట్టుబడి వ్యయం పెరుగుదలతో అన్నదాతలపై మరింత భారం
- మౌలిక వసతుల కొరతతో పంటలకు గిట్టుబాటు ధర కష్టమే
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వాలు సమగ్ర చర్యలు చేపట్టాలి
- భారతీయ కిసాన్ సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి



**హైదరాబాద్,ఆగస్ట్ 8,(డిడి9 వార్త):**

భారతదేశంలోని రైతులు ప్రస్తుతం అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని భారతీయ కిసాన్ సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి అన్నారు. వాతావరణ మార్పులు, అస్థిర మార్కెట్ ధరలు, పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, కూలీల కొరత, పంటల నిల్వకు సరైన మౌలిక వసతులు లేకపోవడం వంటి సమస్యలు రైతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో సకాలంలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు ఒకేసారి భారీ వర్షాలు పడటం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు అనిశ్చితంగా మారడంతో రైతులు సంప్రదాయ పంటల సాగు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు మారాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. మొదటి వర్షాలు సకాలంలో పడకపోవడం లేదా వర్షపాతం అస్థిరంగా ఉండటం వల్ల అనేక ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని యర్రం వెంకటరెడ్డి తెలిపారు. మరోవైపు కుండపోత వర్షాలు, వరదల కారణంగా చేతికొచ్చిన పంటలు కూడా నష్టపోతున్నాయని అన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్ ధరలు పడిపోవడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని తెలిపారు. పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితుల్లో రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేరుగా మార్కెట్‌ను చేరుకునే అవకాశాలు లేకపోవడంతో మధ్యవర్తులు తక్కువ ధరలకు పంటలను కొనుగోలు చేసి అధిక లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటల నమోదు, కొనుగోళ్లలో జాప్యం కూడా రైతులకు ఇబ్బందిగా మారుతోందని అన్నారు. కొనుగోలు కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి రైతుల నుంచి పంటలను సకాలంలో కొనుగోలు చేయాలని కోరారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగడంతో వ్యవసాయ పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగిందని యర్రం వెంకటరెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ కూలీల కొరతతో పాటు రోజువారీ కూలి ఖర్చులు పెరగడం కూడా రైతులకు అదనపు ఆర్థిక భారంగా మారిందన్నారు. కూరగాయలు, టమాటాలు వంటి త్వరగా పాడయ్యే పంటలను నిల్వ చేసుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో తగిన కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు లేవని తెలిపారు. సరైన రవాణా, నిల్వ వ్యవస్థలు లేకపోవడంతో రైతులు పంటలను తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తోందన్నారు. పంట బీమా పరిహారం పొందడంలో రైతులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అగ్రిస్టాక్ (AgriStack) నమోదులో ఎదురయ్యే సాంకేతిక లోపాల కారణంగా అర్హత ఉన్న రైతులకు కూడా పథకాల ప్రయోజనాలు, పరిహారం సకాలంలో అందకపోయే పరిస్థితి ఉందని తెలిపారు దేశంలో అధిక శాతం రైతులు చిన్న కమతాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, దీంతో ఆధునిక వ్యవసాయ యంత్రాలను వినియోగించడం వారికి కష్టంగా మారుతోందని యర్రం వెంకటరెడ్డి అన్నారు. రైతుల ఉత్పాదకతను పెంచేందుకు చిన్న రైతులకు అనుకూలమైన యాంత్రీకరణ, సామూహిక సాగు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (FPOలు) వంటి విధానాలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు రైతుల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలకంటే దీర్ఘకాలిక విధానాలు అవసరమని ఆయన అన్నారు. సూక్ష్మ నీటిపారుదల, డ్రిప్ ఇరిగేషన్, సేంద్రీయ వ్యవసాయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పంటల నిల్వ–రవాణా మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే రైతులకు అందాల్సిన పంట రుణ మాఫీ, బీమా పరిహారం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కోరారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, మార్కెట్ భద్రత, నష్టపరిహారం, తక్కువ పెట్టుబడి వ్యయం లభించేలా సమగ్ర వ్యవసాయ విధానాన్ని రూపొందించినప్పుడే దేశ వ్యవసాయ రంగం స్థిరంగా అభివృద్ధి చెందుతుందని భారతీయ కిసాన్ సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# అధికారం కోసం కొట్లాట కాదు..

- విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టాలి
- పాఠశాల ఆవరణను శుభ్రం చేసిన బీజేపీ శ్రేణులు – అధికారంలో ఉన్న నాయకులకు నాగేళ్ల సాయికిరణ్ చురకలు





**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 08(డిడి9 వార్త):**

అధికారంలో ఉన్న నాయకులు పదవులు, స్వలాభాల కోసం పరస్పరం విమర్శించుకోవడం, కొట్టుకోవడం కంటే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని బీజేపీ మండల అధ్యక్షుడు నాగేళ్ల సాయికిరణ్ అన్నారు. ముఖ్యంగా భావి తరాలైన విద్యార్థులు చదువుకునే పాఠశాలల పరిస్థితులపై బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.బీర్కూర్ మండలం బరంగేడ్డి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల ప్రహరీ గోడ లోపల, కిటికీల వద్ద పెరిగిన గడ్డి, పొదలు, ఇతర అపరిశుభ్రతను బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామయువకులు తొలగించారు.వర్షాకాలం కావడంతో పాఠశాల పరిసరాల్లో పాములు, విషపూరితమైన పురుగులు సంచరించే ప్రమాదం ఉండటంతో విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు సాయికిరణ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాకు అధికారం అవసరం లేదు.. ప్రజల కోసం పనిచేయడమే ముఖ్యం.అధికారంలో ఉన్నవారు పదవుల కోసం, స్వలాభాల కోసం ఒకరినొకరు విమర్శించుకోవడం కాదు.. పాఠశాలల్లో పిల్లలకు కనీస సౌకర్యాలు ఉన్నాయా? పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా? విద్యార్థులకు రక్షణ ఉందా? అనే విషయాలను ముందుగా పట్టించుకోవాలి అని అన్నారు.ప్రజల కోసం పనిచేయాల్సిన వారు రాజకీయ విమర్శలకే పరిమితమైతే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? అని ప్రశ్నించారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం జరిగితే చిన్న సమస్య కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని, అందువల్ల సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలలను తరచూ పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించి ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం తీసుకువచ్చారని సాయికిరణ్ గుర్తుచేశారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థులు ఆరోగ్యంగా చదువుకోగలరని అన్నారు.రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమే కాదు.. ప్రజల కష్టాల్లో, పిల్లల సమస్యల్లో, పాఠశాలల అభివృద్ధిలో కనిపించాలి. నాయకుల మధ్య పోటీ అభివృద్ధిలో ఉండాలి కానీ విమర్శల్లో కాదు అని సాయికిరణ్ అన్నారు.పాఠశాలల పరిశుభ్రత, విద్యార్థుల భద్రత, మౌలిక వసతులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు నవీన్, శ్రీకాంత్, గంగాధర్, యువత గంగా ప్రసాద్, లక్ష్మీనారాయణ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షా భావంపై ముందస్తు కార్యాచరణ

- రైతులకు అండగా నిలవాలి..నీటి వినియోగంలో పొదుపు పాటించాలి: పోచారం శ్రీనివాసరెడ్డి



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 08(డిడి9 వార్త):**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిజామాబాద్ ఇంచార్జి కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన రైతుల సమస్యలపై నిర్వహించిన సమగ్ర సమీక్ష సమావేశంలో పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి అధికారులు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వర్షపాతం తగ్గిపోవడంతో ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంట తీవ్రంగా ప్రభావితమవుతోందన్నారు.నీటి కొరత నేపథ్యంలో తక్కువ నీటితో పంటలను సంరక్షించుకునే విధానాలపై రైతులకు వ్యవసాయ అధికారులు తక్షణమే సాంకేతిక సలహాలు అందించాలని ఆదేశించారు.వానాకాలంలో వరి సాగు కష్టసాధ్యంగా మారుతున్న పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడంతో రానున్న రోజుల్లో నీటి పంపిణీపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.అందుబాటులో ఉన్న నీటిని మితంగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అవసరానికి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో నీటిని విడుదల చేయాలని స్పష్టం చేశారు. నీటి వనరుల విషయంలో ప్రతి నిర్ణయం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాలని అన్నారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామస్థాయిలోనే ముందస్తు చర్యలు చేపట్టాలని పోచారం సూచించారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పంటల సంరక్షణ, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ సూచనలు రైతులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు.వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు అవసరమైన సహకారం అందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని పోచారం శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# పోయిన మొబైల్ దొరికేలా కామారెడ్డి పోలీసుల భరోసా

- 20 రోజుల్లో 200 ఫోన్ల రికవరీ.. ఈ ఏడాది 994 ఫోన్లు స్వాధీనం



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 08(డిడి9 వార్త):**

మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి పొందే అవకాశం ఉందని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ కేవలం సమాచార సాధనం మాత్రమే కాకుండా బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫోటోలు, కీలకమైన డేటాను కలిగి ఉండటంతో దాని భద్రతకు పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలనే ఉద్దేశంతో ఇన్స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో ఐదుగురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.ఈ బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రతి నెలా సగటున 150కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తోందని అభినందించారు.ఇటీవల చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కేవలం 20 రోజుల్లోనే సుమారు రూ.32 లక్షల విలువైన 200 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు రూ.1.59 కోట్ల విలువైన 994 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.గత ఏడాది కూడా 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు.సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 5,275 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. సుమారు రూ.8.44 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లను బాధితులకు విజయవంతంగా అప్పగించినట్లు వెల్లడించారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ప్రజలు కాలయాపన చేయకుండా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దుర్వినియోగాన్ని నివారించేందుకు వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని కోరారు. పోయిన మొబైల్ ఫోన్ ద్వారా సైబర్ మోసాలకు అవకాశం ఉన్నందున గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.రికవరీ అయిన మొబైల్ ఫోన్లను పొందేందుకు బాధితులు సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్ఐ బాలరాజును (8712686114) సంప్రదించాలని పోలీస్ శాఖ సూచించింది.

# ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి

- క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ భరోను జయప్రదం చేయాలి
- నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 08(డిడి9 వార్త):**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్యాంకులు, రైల్వేలు, పోస్టల్, టెలికం, సింగరేణి, విమానయాన సంస్థలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించకూడదన్నారు.ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలని, మందులపై ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే జైల్ భరో నిరసనను విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, సత్యం, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాల్‌నర్సు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఇందిర, బాబాయ్, లక్ష్మి , సవిత, ఆశా యూనియన్ నాయకులు ఇందిర, రాజశ్రీ, మమత, మున్సిపల్ యూనియన్ నాయకులు ఆయాజ్, మహమ్మద్, సంతోష్, నర్సింగ్‌రావు, ప్రభు, ఏడారపు రాజు, దీవెన, శివ, రాజవ్వ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, కిష్టగౌడ్, దుర్గయ్య, ప్రమీల, హమాలీ సంఘం నాయకులు, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు సాయిబాబా, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సింగూర్ నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలి

## వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలి
## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 08(డిడి9 వార్త):**



సింగూర్ జలాశయంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే ప్రాధాన్యంగా వినియోగించాలని, రానున్న వర్షాలను సద్వినియోగం చేసుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన జరిగిన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సింగూర్ జలాశయంలో నీటి నిల్వలు, తాగునీటి సరఫరా, సాగునీటి పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు.సింగూర్ జలాశయంలో ప్రస్తుతం 4.140 టీఎంసీల నీరు నిల్వ ఉందని కలెక్టర్ తెలిపారు. జలాశయానికి మరమ్మతు పనులు కొనసాగుతున్నందున పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయలేని పరిస్థితి ఉందన్నారు.ప్రస్తుతం ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు వినియోగించాలని సూచించారు. ఈ నీటి నిల్వ సుమారు 60 నుంచి 90 రోజుల వరకు తాగునీటి అవసరాలను తీర్చగలదని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సింగూర్ జలాశయంలోకి వచ్చే వరద నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి మరో 4 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేసుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ చర్యలతో నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రానున్న ఐదారు నెలల పాటు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడవచ్చని తెలిపారు.

**వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి**

వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో కామారెడ్డి జిల్లాలో జలసిరి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేయడంతో పాటు భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టి భూగర్భ జలమట్టాలను పెంచాలని సూచించారు.సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.కామారెడ్డి జిల్లాలోని కౌలాస్ నాలా, పోచారం ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయని కలెక్టర్ తెలిపారు.ఆయకట్టు పరిధిలోని పంటలకు సాగునీటిని అందించేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.సమావేశంలో నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూర్, కౌలాస్ నాలా, పోచారం, రామడుగు తదితర జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితి, ఆయకట్టు పంటలకు సాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.సమావేశంలో ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, కామారెడ్డి అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, కామారెడ్డి వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, నీటిపారుదల, భూగర్భ జలాలు, వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రగతి పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు

- తెలంగాణ సంస్కృతి–సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు
- బోనాలతో సందడి చేసిన ప్రగతి పాఠశాల ప్రాంగణం
- సంప్రదాయ వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యార్థులు
- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన చిన్నారులు
- విద్యార్థుల్లో తెలంగాణ పండుగల విశిష్టతపై అవగాహన
- చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం
- విద్యార్థుల ఉత్సాహంతో పండుగ వాతావరణాన్ని తలపించిన ప్రాంగణం
- బోనాల విశిష్టతను విద్యార్థులకు వివరించిన ఉపాధ్యాయులు




**ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో బోనాల పండుగ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అందంగా అలంకరించిన బోనాలతో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతిలో ఈ వేడుకకు ఉన్న ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.పాఠశాల ప్రాంగణం బోనాల సందడితో కళకళలాడింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటారు. చదువుతో పాటు విద్యార్థులకు మన సంస్కృతి, పండుగలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురకంటి వనమాల, ప్రిన్సిపాల్ కె. ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ ఏ. మంజుల, నిజాముద్దీన్, పీఈటీ అల్లం సాయికిరణ్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518